శుక్రవారం
11-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 139
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైనా కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత బావో టోంగ్ మృతి

చైనా రాజకీయ సంస్కరణల చాంపియన్, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు బావో టోంగ్ (90) కన్నుమూశారు. 1989లో బీజింగ్‌ను కుదిపివేసిన టియాన్మెన్ ఆందోళనల క్రమంలో ఈయన జైలు పాలయ్యారు.

2లో

మళ్లీ మట్టి ముంతేనా?

- మోదీ రాకతో రాష్ట్రానికి ఒరిగేదేంటి?
- విభజన హామీలకు భరోసా ఇస్తారా?
- నేడు విశాఖకు ప్రధాని

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: ప్రధాని నరేంద్రమోదీ విశాఖ పర్యటన వల్ల ప్రయోజనమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మోదీ అధికారం చేపట్టి 8 ఏళ్లు దాటినా విభజన హామీల ఊసే లేదు. విశాఖ రైల్వేజోన్ ప్రకటనలకే పరిమితమైంది. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడం లేదు. రాజధాని అమరావతిపై స్పష్టత లేదు. నిర్మాణానికి నిధులు ఇచ్చిన దాఖలాలు లేవు. మొత్తం విభజన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదు. ఇప్పుడొచ్చి విశాఖ వేదికగా ఏమి చెబుతారు. మళ్లీ మట్టి ముంతను రాష్ట్ర ప్రజల చేతుల్లో పెడతారన్న ప్రచారం సాగుతోంది. విశాఖ పర్యటన కోసం ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం సాయంత్రం ఇక్కడికి వస్తున్నారు. రాత్రి ఇక్కడే బస చేసి శనివారం బహిరంగసభలో పాల్గొంటారు. అనేక పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. మోదీ పర్యటనను భుజాన వేసుకున్న వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారు. విభజన కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడం, విభజన హామీలు పూర్తి చేయకపోవడం, ప్రత్యేక హోదా, విశాఖ కేంద్రంగా వాల్తేర్ రైల్వే డివిజన్‌తో కూడిన కొత్త జోన్ ఏర్పాటు, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు ఇవ్వకపోవడం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో కేంద్ర

- మిగతా 2 లో

మోదీకి ఘన స్వాగతమా?

- ఇదేనా కేంద్రం మెడలు వంచడమంటే
- ప్రజలకు జగన్ సమాధానం చెప్పాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు అడుగడుగునా మోసం, ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి వైసీపీ ఘన స్వాగతం పలకడానికి సిగ్గుండాలని, ఇదేనా వైఎస్ జగన్ చెప్పిన 'కేంద్రం మెడలు వంచడమంటే' అని...సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. విశాఖ పర్యటన సందర్భంగా 'మోదీకి రెడ్‌కార్పెట్ వెల్‌కం' చెప్పేందుకు జగన్ ప్రభుత్వం ఆగమేఘాలమీద స్వాగత ఏర్పాట్లు చేస్తోందన్నారు. జగన్, విజయసాయిరెడ్డి పార్టీ ప్లీనరీ కంటే ఎక్కువ కష్టపడుతున్నారని దుయ్యబట్టారు. దాదాపు ఏడు వేల మంది ఉద్యోగస్తులను, అధికారులను వినియోగించి లక్షలాది మంది ప్రజలను సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇదంతా చాలా కేసుల్లో కూరుకుపోయిన జగన్, విజయసాయిరెడ్డి తమను తాము కాపాడుకోవడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. వందిమాగధుల మాదిరిగా స్వాగతించడాన్ని తప్పుబట్టారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి పదేపదే అన్యాయం, మోసం, ద్రోహం చేస్తూనే ఉందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వైసీపీ నుంచి 25మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు

- మిగతా 2 లో

మోదీ పర్యటనను నిరసిద్దాం

- రాష్ట్రపతి, గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనమేమిటి?
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

8లో

సభ కోసం వైసీపీ పాట్లు

- భారీగా జన సమీకరణే ధ్యేయం
- 98 వార్డుల్లో 2 వేల చొప్పున కార్పొరేటర్లకు టార్గెట్
- డ్వాక్రా మహిళల తరలింపునకు ప్రత్యేక బస్సులు
- వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆర్పీలకు బాధ్యతలు
- మోదీ మెప్పు కోసమేనంటున్న విపక్షాలు

2లో

మాల్దీవుల్లో భారీ అగ్ని ప్రమాదం

- 10 మంది సజీవదహనం
- అంతా వలస కూలీలు
- మృతుల్లో 9 మంది భారతీయులు
- భారత హైకమిషన్ దిగ్భ్రాంతి
- హెల్ప్‌లైన్లు ఏర్పాటు

మాలే: మాల్దీవులలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ దేశ రాజధాని మాలేలోని ఒక భవనంలో గురువారం ఈ ప్రమాదం జరుగగా అందులో ఇతర దేశాల నుంచి వచ్చిన వలస కూలీలు ఉంటున్నారు. కింది అంతస్తులోని గ్యారేజిలో మంటలు చెలరేగి భవనం అంతటా వ్యాపించాయి. 10 మంది మంటలకు ఆహుతి కాగా వారిలో తొమ్మిది మంది భారతీయులు, ఒక బంగ్లాదేశీయుడు ఉన్నట్లు భద్రతా అధికారి ఒకరు తెలిపారు. మృతదేహాలన్నీ పై అంతస్తులో లభ్యం కాగా ఆ అంతస్తు పూర్తిగా దగ్ధమైందని అధికారులు తెలిపారు. మంటలను ఆర్పేందుకు నాలుగు గంటలకుపైగా సమయం పట్టిందని అగ్నిమాపక దళ ప్రతినిధి చెప్పారు. అనేక మంది గాయాలపాలయ్యారని, వారందరిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించామని

- మిగతా 2 లో

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అంగీకరించం

- వెనక్కితీసుకుంటున్నట్లు ప్రధాని ప్రకటించాలి
- విశాఖలో అఖిలపక్షం ఆందోళన

విశాఖ ఉక్కు పరిరక్షణ, ఏపీ పునర్విభజన సమస్యలపై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మోదీ పర్యటనను పురస్కరించుకొని విపక్షాలు గురువారం విశాఖలో ఆందోళనకు దిగాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అంగీకరించేది లేదని స్పష్టం చేశాయి.

3లో

వైసీపీలో మద్యం కలకలం

- ఢిల్లీ కేసులో విజయసాయిరెడ్డి బంధువు అరెస్టు
- మోదీ పర్యటన సమయంలో అధిష్ఠానానికి షాక్
- అధికార, ప్రతిపక్షాల విమర్శనాస్త్రాలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఢిల్లీ మద్యం కేసులో వైసీపీ కీలక నేత, ఎంపీ విజయసాయిరెడ్డి దగ్గర బంధువు (అల్లుడి అన్న) శరత్ చంద్రారెడ్డిని ఈడీ అరెస్టు చేయడంతో ఆ పార్టీలో కలకలం నెలకొంది. ఉత్తరాంధ్ర పర్యటనకు 11, 12 తేదీల్లో ప్రధాని మోదీ పర్యటన సమయంలో...అన్నీ తానై చూస్తున్న సీఎం జగన్‌కు, విజయసాయిరెడ్డికి ఈడీ ఊహించని ఝలక్ ఇచ్చింది. తాజాగా అరెస్టయిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అరబిందో ఫార్మా ఎండీ పెనక శరత్ చంద్రారెడ్డి, మద్యం వ్యాపారి వినయ్‌బాబును అరెస్టు చేసినట్లు ఈడీ వెల్లడించింది. ఈ చర్యలతో వైసీపీ నేతలకు, ఆ పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. లిక్కర్ స్కామ్‌లో వారిద్దరూ కీలకంగా వ్యవహరించినట్లు ప్రచారముంది. మోదీ పర్యటనను విజయవంతం చేసి, ఆయన మెప్పు పొందేందుకు వైసీపీ, జగన్ సర్కారు సర్వం నిమగ్నమైంది. ఈ తరుణంలో ఈడీ ఇచ్చిన షాక్‌తో వారిలో ఆందోళన మొదలైంది. ఈ వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాలు విమర్శనాస్త్రాలు సంధించుకున్నాయి. కొంతకాలంగా ఉత్తరాంధ్ర కేంద్రంగా విజయసాయిరెడ్డి పాగా

- మిగతా 2 లో

ధర రాక... కొనేవాడు లేక

- టమాటా రైతుకు మిగిలింది కన్నీరే!
- రవాణా ఖర్చు దక్కని వైనం
- నాణ్యత పేరుతో దోపిడీ
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్రబ్యూరో–కర్నూలు/పత్తికొండ: టమాటా ధర ఒక్కో సారి వినియోగదారులకు కన్నీళ్లు తెప్పిస్తుంటుంది. నిన్న మొన్నటి వరకూ కిలో రూ.40 నుంచి 50 పలికిన ధర ఇప్పుడు దిగొచ్చింది. అయితే, రైతులకు మాత్రం అపార నష్టాల్ని మిగులుస్తోంది. కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో టమాటా ధరలు భారీగా పతనమయ్యాయి. కిలో టమాటా కేవలం రూ.2 కూడా పలక్కపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నిన్న మొన్నటి వరకు ఆకాశాన్నంటిన టమాటా ధర ఒక్కసారిగా కుప్పకూలింది. కిలో టమాటా రెండురోజుల క్రితం రూ.5 కు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. తాజాగా కనీసం ఆ ధర కూడా లభించకపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. నాణ్యత లేదన్న సాకుతో టమాటాలను వ్యా పారులు కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారు. ఎంతో కష్టపడి పొలం నుంచి పంటను మార్కెట్‌కు తీసుకువస్తే... రవాణా చార్జీలు కూడా రావడం లేదని ఆవేదనకు గురవుతున్నారు. వేరే గత్యంతరం లేక తీసుకొచ్చిన పంటను మార్కెట్ వద్దనే పారబోసి వెళ్లిపోతున్నారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టమోటాలు... కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సుమారు 20లారీల టమాటా తరలి వెళుతుంది. పత్తికొండ, తుగ్గలి,

- మిగతా 2 లో

పదేళ్లకోసారి అప్‌డేట్ చేయాల్సిందే

'ఆధార్' నిబంధనలు సవరించిన కేంద్రం

ఆధార్‌కు సంబంధించిన నిబంధనలను కేంద్రప్రభుత్వం సవరించింది. నమోదు చేసుకొని పదేళ్లు పూర్తి అయిన తర్వాత ఆధార్ నంబరు కలిగి ఉన్నవారంతా తమ పేరు, ఫొటో, చిరునామా సంబంధించిన పత్రాలను అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టంచేసింది.

8లో

పత్తి పంటను దున్నేస్తున్నారు!

నకిలీ పత్తి విత్తనాలతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. పత్తి తీతకు ముందే పంటను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. విత్తన కంపెనీ యాజమాన్యం మాయమాటలు నమ్మి నట్టేటమునిగిపోయామని కంటనీరు పెట్టుకుంటున్నారు.

నకిలీ విత్తనాలతో రైతన్న లబోదిబో

- కంపెనీ మాయమాటలతో నిండా మునిగామని ఆవేదన
- అప్పులు ఎలాతీర్చాలంటూ అన్నదాతల ఆందోళన
- విత్తన కంపెనీపై చర్యలు తీసుకోవాలని వినతి

2లో

ఇదీ లోకం!

బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- నలుగురి దుర్మరణం.. 15మందికి గాయాలు
- పశ్చిమ గోదావరి జిల్లాలో విషాదం



విశాలాంధ్ర తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా ఎల్ అగ్రహారం, కడియద్ద గ్రామంలో అన్నవరం అనే వ్యక్తికి చెందిన బాణసంచా తయారీ కర్మాగారంలో గురువారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. ఘటనా స్థలంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం రాత్రి గం.8 నుండి 8.30 మధ్యలో హఠాత్తుగా ఈ భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధ్వని తాడేపల్లిగూడెం పట్టణ శివారు ప్రాంతం వరకు వినిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక దళం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. పొలాలు మధ్య పేలుడు సంభవించడంతో పశువులు భారీగా మరణించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఫైర్ ఇంజిన్ రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. 300 మీటర్ల దూరంలోనే నిలిచిపోయింది. గాయపడిన వారిని తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు.

చైనా కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత బావో టోంగ్ మృతి

బీజింగ్: చైనా రాజకీయ సంస్కరణల చాంపియన్, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు బావో టోంగ్ (90) కన్నుమూశారు. 1989లో బీజింగ్‌ను కుదిపివేసిన టియాన్మెన్ ఆందోళనల క్రమంలో ఈయన జైలు పాలయ్యారు. టోంగ్ మరణంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న చైనా కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య అనుకూల ఆందోళనల సమయంలో 1980 దశకంలో రాజకీయ సంస్కరణల కోసం ఎంతో తోడ్పడ్డారు. అనంతరం ఏడేళ్లు జైల్లో గడిపారు. బావో టోంగ్ మరణించినట్లు ఆయన తనయుడు బావో పు ధ్రువీకరించారు. బీజింగ్‌లో బుధవారం ఉదయం బావో టోంగ్ చనిపోయారని వెల్లడించారు. 1980లో కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్న జావో జియాంగ్‌కు అత్యంత సన్నిహితుడిగా బావో టోంగ్ ఉండేవారు. ఈయన 1932లో ఝెజియాంగ్ ప్రావిన్స్‌లో జన్మించారు. 1949లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అదే ఏడాది చైనాలో కీలక నేతగా ఎదిగారు. జావోకు రాజకీయ కార్యదర్శిగా వ్యవహరించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా, రాజకీయ సంస్కరణల కార్యాలయం డైరెక్టర్‌గానూ బావో టోంగ్ పనిచేశారు.

జీ20 సదస్సుకు పుతిన్ దూరం

రష్యా అధ్యక్షుడి నిర్ణయంపై ఇండోనేసియా ప్రకటన

జకార్తా: ఇండోనేసియాలో వచ్చే వారం జరగబోయే జీ20 శిఖరాగ్ర సమావేశానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరు కావడం లేదని ఇండోనేసియా ప్రభుత్వ అధికారి గురువారం తెలిపారు. రష్యాకు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ప్రాతినిధ్యం వహిస్తారని ఇండోనేసియాలోని డెన్‌పాసర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీ-20 కార్యక్రమాల చీఫ్ లుహుత్ బిన్సర్ పాండ్‌జైతన్ తెలిపారు. రష్యా ప్రభుత్వ నిర్ణయాన్ని ఇండోనేసియా ప్రభుత్వం గౌరవిస్తున్నట్లు వెల్లడించారు. దేశాధ్యక్షుడు జోకో విడోడోతో జరిగిన స్నేహపూర్వక టెలిఫోన్ సంభాషణలో ఈ నిర్ణయం గురించి పుతిన్ తెలిపినట్లు పాండ్‌జైతన్ అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం క్రమంలో అమెరికాను ఎదుర్కోవాలని పుతిన్ అనుకోవడం లేదని సమాచారం. బాలీలో రెండు రోజులు జరగబోయే జీ20 సదస్సు ఈనెల 15న ప్రారంభమవుతుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు ప్రపంచ నేతలు హాజరుకానున్నారు. పుతిన్ హాజరైతేగనుక రష్యా-ఉక్రెయిన్ యుద్ధం క్రమంలో బైడెన్‌తో ఒకే వేదికను ఆయన మొదటిసారి పంచుకోవాల్సి వచ్చేది.

విశాలాంధ్ర ప్రపంచం

రష్యాపై ఆగని బ్రిటన్ ఆంక్షలు

18 బిలియన్ పౌండ్ల ఆస్తులు ఫ్రీజ్

లండన్: రష్యాపై బ్రిటన్ ఆంక్షల పరంపర కొనసాగుతూనే ఉంది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యల క్రమంలో రష్యాలో రాజకీయంగా పట్టు ఉన్న ఆ దేశానికి చెందిన బడా వ్యాపారవేత్తలతో పాటు పౌరులకు సంబంధించిన 18 బిలియన్ పౌండ్లు (20.5 బిలియన్ డాలర్లు) విలువ చేసే ఆస్తులను ఫ్రీజ్ చేసినట్లు బ్రిటన్ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. లిబియా, ఇరాన్ కంటే కూడా ఎక్కువగా బ్రిటన్ ఆంక్షలను ఎదుర్కొనే దేశంగా రష్యా ఉన్నదని ఆర్థిక శాఖలో భాగంగా ఉన్న ఆర్థిక ఆంక్షల అమలు కార్యాలయం వెల్లడించింది. గతంలో బ్రిటన్ విధించిన ఆంక్షల కంటే ప్రస్తుతం ఫ్రీజ్ చేసిన రష్యా ఆస్తుల విలువ ఆరు బిలియన్ పౌండ్లు ఎక్కువని తెలిపింది.

యుద్ధ యంత్రంగా తయారైన రష్యాపై ఎన్నడూ లేని విధంగా ఆంక్షలను విధించామని బ్రిటన్ సహాయమంత్రి ఆండ్రూ గిరిఫిత్ వెల్లడించారు. 1200కుపైగా వ్యక్తులు 120కుపైగా రష్యన్ సంస్థలపై బ్రిటన్ ఆంక్షలు విధించింది. ఉక్రెయిన్‌కు సైన్యాన్ని పంపినప్పటి నుంచి ఆ దేశానికి సంబంధించిన ఆస్తులను ఫ్రీజ్ చేయడం, ప్రయాణ ఆంక్షలు విధించడాన్ని బ్రిటన్ ప్రభుత్వం మొదలు పెట్టింది.

అమెరికాలో ఎవరికి ఎన్ని!

ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు 198 స్థానాలు - డెమొక్రాట్లకు 178

ప్రజాస్వామ్యానికి మంచిరోజు: అధ్యక్షుడు బైడెన్

వాషింగ్టన్: అమెరికాలో మధ్యంతర ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. అమెరికా ప్రతినిధుల సభలోని మొత్తం 435 సీట్లలో విపక్ష రిపబ్లికన్లకు 198 సీట్లు, డెమొక్రాట్లకు 178 సీట్లు దక్కాయి. డెమొక్రాట్ల ఆధీనంలో ఉన్న చాలా సీట్లు రిపబ్లికన్లకు దక్కడం చర్చనీయాంశమైంది. సెనేట్‌లో రెండు పార్టీలకు చెరో 48 సీట్లు వచ్చాయి. ద్రవ్యోల్బణం, గర్భవిచ్ఛిత్తిపై తీర్పు, తుపాకీ విధానం, అక్రమ వలసల విషయంలో బైడెన్ నిర్ణయాలు అమెరికన్లకు అసంతృప్తి కలిగించినట్లు ఈ ఎన్నికల ఫలితాల ద్వారా వెల్లడవుతోంది. అయితే, రిపబ్లికన్లు పుంజుకోవడంతో 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమవుతున్నారు. ఈనెల 14న ఈ విషయంలో కీలక ప్రకటన చేయబోతున్నట్లు ముందుగానే ప్రకటించారు. బైడెన్ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాల్లో ఆయన ఉన్నారు. మరోవైపు డెమొక్రాటిక్ పార్టీ ఊహించిన దాని కంటే మెరుగైన ఫలితాలను కనబరిచిందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచి రోజు.. అమెరికాకు కూడా అని శ్వేతసౌధం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. తన ఆర్థిక అజెండాకు అమెరికన్లలోని అనేక మంది మద్దతిచ్చారని, దీనిని బట్టి 2024లో మరోమారు అధ్యక్షత వహించేందుకు తనకు అవకాశం ఉందన్న సంకేతాలు అందుతున్నాయని చెప్పారు. అయితే పోటీ చేయాలా లేదా అన్నది వచ్చే ఏడాది నిర్ణయిస్తానని బైడెన్ తెలిపారు.

మళ్లీ మట్టి ముంతేనా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రకటించిన అనేక సంస్థలను ప్రారంభించకపోవడం, పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు విడుదల చేయకపోవడంపై రాష్ట్ర ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ అమలు చేయకుండా మోదీ రాష్ట్రానికి ఎన్నిసార్లు వచ్చినా ఒరిగేదేముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అమరావతి రాజధాని శంకుస్థాపనకు వచ్చినప్పుడు ముంతమట్టి తీసుకొచ్చిన మోదీని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటుకు శంకుస్థాపన కూడా చేయలేదు. 665 రోజులుగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమానికి పరిష్కారం లేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపుతామన్న ప్రకటన కూడా ఉండబోదని బీజేపీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర సమస్యలను పరిష్కరించని మోదీ పర్యటనను వైసీపీ ప్రభుత్వం ఎందుకు స్వాగతిస్తుందో అర్థం కావడం లేదు. మోదీ సభను ఎందుకు నిర్వహిస్తుందో అంతుపట్టడం లేదు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఇస్తామని 2009లోనే ప్రకటించినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు మోదీ విశాఖ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారంటున్నారు. స్వప్రయోజనాల కోసమే మోదీ సభను వైసీపీ నిర్వహిస్తుందని విపక్షాలు మండిపడుతున్నాయి. రాయపూర్- విశాఖ మధ్య రూ.3778 కోట్లతో ఆరులైన్ల రోడ్డు నిర్మాణానికి, రూ.460 కోట్లతో విశాఖ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు, శ్రీకాకుళం నుంచి ఒడిశాలోని అంగుల్ పట్టణం వరకు రూ.2658 కోట్లతో గెయిల్ నిర్మిస్తున్న గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. విశాఖపట్నం పోర్టు రహదారి నిర్మాణం కోసం కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు రూ.565 కోట్లతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేస్తారు. మరికొన్ని చిన్నాచితక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతోనే మోదీ పర్యటన సాగుతుందని ప్రజలు భావిస్తున్నారు.

మోదీకి ఘన స్వాగతమా?

(మొదటిపేజీ తరువాయి)

వంచి, ప్రత్యేక హోదా సాధిస్తానన్న జగన్...ఇప్పుడు మోదీకి మోకరిల్లుతున్నారెందుకు? ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన చట్టం హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా, కడప స్టీల్ ఫ్యాక్టరీ ప్రస్తావనే లేకుండా చేసినందుకా? అని నిలదీశారు. కేంద్ర బడ్జెట్‌లో అడుగడుగునా మొండి చేయి చూపినందుకా?, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు అంశంపై కేంద్ర మంత్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ తాత్సారం చేస్తునందుకా? ఎందుకు మోదీకి ఘనస్వాగతం పలుకుతున్నారో సీఎం జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ...విశాఖ పర్యటనను నిరసిస్తూ 11, 12 తేదీల్లో వామపక్ష పార్టీల అధ్వర్యంలో విశాఖపట్నంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 26జిల్లాల్లో పెద్దఎత్తున నిరసనలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ నిరసనల్లో ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వేమన విగ్రహాన్ని పున:ప్రతిష్ఠించాలి

కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహాన్ని యథాతథ స్థానంలో పున:ప్రతిష్ఠించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మహనీయులను అవహేళన చేస్తోందనీ, అవమానిస్తోందన్నారు. వివిధ పథకాలకు, స్కీములకు, విశ్వవిద్యాలయాలకు ఉన్న మహనీయుల పేర్లను, విగ్రహాలను తొలగించి ఆ స్థానంలో వైఎస్ఆర్, జగన్ పేర్లను పెడుతూ, వైఎస్ఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తోందనీ, చారిత్రక స్మృతులను చెరిపేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని విమర్శించారు. ఇప్పటికే ప్రజాధనం వెచ్చించి చేస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలకు, పథకాలకు వైఎస్ఆర్, జగనన్న పేర్లను పెట్టుకున్నారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఆ పేరును ఆగమేఘాల మీద తొలగించి, వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్పు చేశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరున ఉన్న విదేశీ విద్యా పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి, జగనన్న విదేశీ విద్యా పథకంగా మార్పుచేశారని వివరించారు. ఇప్పుడు మరింతగా దుశ్చర్యలకు పాల్పడుతూ కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో మహనీయులను, స్వాతంత్ర్య సమరయోధులను, చరిత్రకారులను విస్మరించి, అన్నింటా తమ పేర్లు మాత్రమే ఉండాలనే దుగ్ధతో జగన్ చేస్తున్న దుర్మార్గపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. తక్షణమే యోగి వేమన విశ్వవిద్యాలయంలో తొలగించిన వేమన విగ్రహాన్ని యథాతథ స్థానంలో పున:ప్రతిష్ఠించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

విగ్రహం తొలగింపు తగదు: ఓబులేసు

కమలాపురం: కడపలోని వైవీయూలో వేమన విగ్రహాన్ని తొలగించి, రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని పెట్టడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఓబులేసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడో సైన్స్ బ్లాక్ వద్ద ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తీసుకొచ్చి మెయిన్ ప్రధాన కూడలిలో పెట్టడాన్ని ఆయన వ్యతిరేకించారు. ప్రధాన గేటు ముందు కూడలి ఏర్పాటు చేసి, అక్కడ పది అడుగుల దిమ్మెపై 20 అడుగుల వేమన కాంస్య విగ్రహాన్ని, లేదా ఇంకా పెద్ద విగ్రహాన్ని పెట్టినా సంతోషిస్తామన్నారు. తక్షణమే వేమన పెద్ద కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి, విశ్వవిద్యాలయానికి సముచిత స్థానం, గౌరవం ఇవ్వాలని ఆయన కోరారు.

మాల్దీవుల్లో భారీ అగ్ని ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. మాఫన్ను మైదానాన్ని పునరావాస కేంద్రంగా మార్చినట్లు మాల్దీవుల జాతీయ విపత్తు నివారణ యంత్రాంగం వెల్లడించింది. మానవతా సాయం, మద్దతు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ట్వీట్ చేసింది. నిద్రలో ఉన్న సమయంలో మంటలు వ్యాపించడంతో ఎవరూ తప్పించుకునే అవకాశం లేకపోయిందని సమాచారం. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై మాల్దీవుల్లోని భారత హైకమిషన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అగ్నిప్రమాదంలో భారతీయులు మరణించారన్న వార్త తమను కలిచివేసిందని పేర్కొంది. మాల్దీవులు అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. తొమ్మిది మంది భారతీయులు చనిపోయినట్లు అధికారికంగా ప్రకటించింది. మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసినట్లు ట్విట్టర్ మాధ్యమంగా వెల్లడించింది.

పత్తి పంటను దున్నేస్తున్నారు!

విశాలాంధ్ర-రుద్రవరం: నకిలీ పత్తి విత్తనాలతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. పత్తి తీతకు ముందే పంటను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. విత్తన కంపెనీ యాజమాన్యం మాయమాటలు నమ్మి నట్టేటమునిగిపోయా మని కంటనీరు పెట్టుకుంటున్నారు. వందలాది ఎకరాలలో పత్తి విత్తనాలు నాటి లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా పిడికెడు పత్తి చేతికి రాకపోగా పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లా రుద్రవరం మండల పరిధిలోని పెద్దకంబులూరు, అప్పనపల్లి, గోనంపల్లి, రుద్రవరం, నరసాపురం, రెడ్డి పల్లె తదితర గ్రామాల రైతులు వందలాది ఎకరాలలో సీడు పత్తి విత్తనాలను నాటారు. ఎకరాకు రూ.50 వేల నుంచి 60 వేల వరకు సాగుకు ఖర్చు చేశారు. యాజమాన్యం ప్రలోభ పెట్టి నకిలీ విత్తనాలు అంటగట్టిందనీ, పంట పూర్తిగా దెబ్బతినడంతో నష్టపోయాం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏంచేయాలో తెలియక పత్తి పంటను ట్రాక్టర్లతో దున్నే పరిస్థితి ఏర్పడిందని బోరుమంటున్నారు. నకిలీ విత్తన కంపెనీపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

విత్తన కంపెనీపై చర్యలు తీసుకోవాలి

మూడు ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటా. వేలాది రూపాయలు అప్పులు చేశా. కల్తీ విత్తనాలతో పంట పూర్తిగా దెబ్బతింది. ఒక్క పత్తి గింజ కూడా తీయడానికి లేకుండా పోయింది. ఇదే విషయాన్ని కంపెనీ యాజమాన్యానికి చెప్పినా ఇదిగో అదుగో అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మాయమాటలతో నమ్మించి విత్తనాలు తీసుకునేలా ఒప్పించి ఈ రోజు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఏం చేయాలో తెలియక ట్రాక్టర్‌తో దున్నేస్తున్నా. అధికారులు స్పందించి విత్తన కంపెనీపై చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన తమకు న్యాయం చేయాలి.

వెంకటేశ్వర్లు, అప్పనపల్లె

న్యాయం చేయండి

నాలుగు ఎకరాల్లో పత్తి గింజలు నాటా. ఇంతవరకు కాయలు సరిగా రాకపోవడంతో ఇదే విషయాన్ని కంపెనీ వారికి చాలాసార్లు చెప్పా. మొదట్లో యాజమాన్యం చెప్పిన మాటలు వేరు... ఇప్పుడు ఉలుకూపలుకూ లేదు. రాజకీయ పరపతి కలిగిన పత్తి విత్తన యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన తమకు తగిన న్యాయం చేయాలి.

ఉశేని, అప్పనపల్లి

మోదీ సభ కోసం వైసీపీ పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు జన సమీకరణపై సొంత పార్టీకి చింత లేదు... వైసీపీ ఉండగా మనకెందుకు బెడద అన్నట్లుగా బీజేపీ నిబ్బరంగా ఉంది. అధికార వైసీపీ మాత్రం శనివారం ఉదయం ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగసభకు జనాన్ని పెద్ద ఎత్తున తరలించడానికి పడరాని పాట్లు పడుతోంది. రాష్ట్రంలో నిత్యం బీజేపీ-వైసీపీ నాయకులు పరస్పర విమర్శలకు పాల్పడుతుండగా, కేంద్రంలో మాత్రం దోస్త్ మేరా దోస్త్ అన్న రీతిలో రాజకీయం నడుస్తోందని, మోదీ వద్ద మెప్పు పొందేందుకే వైసీపీ ఈ సభకు ఏర్పాట్లు, జన సమీకరణ చేస్తోందని వివిధ రాజకీయ పక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే ఓ పక్క తుపాను భయం... మరోపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై విసిగిపోయిన ప్రజలు మోదీ సభకు వస్తారా అన్న సంశయం వైసీపీ నేతలను వెంటాడుతోంది. అధిక ధరలు, నిరుద్యోగం, జీఎస్టీ పేరిట పన్నుల భారం, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయం, విభజన హామీలును నెరవేర్చకపోవడం, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయకపోవడం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకోవడంతో మోదీ సర్కార్ పై ప్రజలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్న నేపథ్యంలో ఈ సభ ను విజయవంతం చేయడం అధికార వైసీపీకి సవాల్ గా మారింది. మోదీ పర్యటన విజయవంతంగా నిర్వహించాలన్న పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం...గత వారం రోజులుగా సభ ఏర్పాట్లు నిర్వహించింది. అయితే భారీగా జన సమీకరణ జరగకపోతే అభాసుపాలవుతాం అన్న ఆందోళన వైసీపీ శ్రేణుల్లో నెలకొంది. బీజేపీ శ్రేణులు ఎక్కడా మోదీ సభకు జనాన్ని తీసుకొచ్చే పనులకు పూనుకోలేదు. ఇప్పటికే 500 బస్సుల్లో ప్రజల్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీ బస్సులను కూడా గ్రామీణ ప్రాంతాల నుంచి జనాన్ని సభాస్థలికి తరలించేందుకు వైసీపీ ప్రభుత్వ పెద్దలు తీసుకున్నారని ఆయా యాజమాన్యాలు ఆరోపించాయి.

జీవీఎంసీ పరిధిలో ఉన్న 98 వార్డుల్లో వైసీపీ కార్పొరేటర్లకు, ఓడిన కార్పొరేట్ అభ్యర్థులకు వార్డుకు 2 వేల మంది చొప్పున మోదీ సభకు తరలించాలని వైసీపీ సమన్వయకర్తలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తాఖీదు ఇచ్చినట్లు సమాచారం. మరోపక్క జీవీఎంసీ యూసిడీ విభాగంలో ఉన్న 1042 మంది ఆర్పీలు, 10 వేల 248 మంది వలంటీర్లు, 578 సచివాలయల ఉద్యోగుల ద్వారా 31 వేల డ్వాక్రా మహిళా సంఘాలల్లో ఉన్న 3లక్షల 48 వేల మంది మహిళల్లో కనీసం 1లక్ష 6 వేల మందిని ఈ సభకు తరలించాలని టార్గెట్ ఇచ్చినట్లు తెలిసింది. అటు గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం 5 వేల మందిని తరలించేలా ఎమ్మెల్యేలకు సైతం టార్గెట్లు ఇచ్చారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 11 మంది వైకాపా ఎమ్మెల్యేలు ఉండడంతో ఈ నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణ చేసి మోదీ, సీఎం జగన్ పాల్గొనే సభకు తరలించి ప్రధాని ముందు వైసీపీ పరువు కాపాడాలని వైసీపీ అధిష్ఠాన నేతలు గట్టిగా చెప్పినట్లు ఆ పార్టీకే చెందిన కిందిస్థాయి కార్యకర్తలు, నాయకులు చెబుతున్నారు. సభకు రెండు లక్షలమందిని తరలించడం లక్ష్యంగా పెట్టుకుంటే... కనీసం లక్షమంది అయినా సభకు చేరుకుంటే విజయవంతం అయినట్లేనని వైసీపీ నేతలు భావిస్తున్నారు. కాగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రధాని సభపై అధికారులు, ప్రభుత్వ పెద్దల్లో గుబులు నెలకొంది. వర్ష ప్రభావం అధికంగా ఉండేట్లయితే... జన సమీకరణ, సభ నిర్వహణ కష్టతరం అవుతుందని తలలు పట్టుకుంటున్నారు. గురువారం సాయంత్రం నుంచే విశాఖలో ఈదురు గాలులు వీయడంతో వారిలో ఆందోళన రెట్టింపైంది.

ధర రాక...కొనేవాడు లేక

(మొదటిపేజీ తరువాయి)

దేవనకొండ, మద్దికెర, ఆస్పరి మండలాల్లో రైతులు సుమారు 2250 హెక్టార్లలో టమాటా పంటను సాగు చేశారు. ఎకరాకు నారు కొనుగోలు నుంచి పంట చేతికి వచ్చే సమయానికి రైతు కనీసం రూ.30 వేల నుంచి 40వేల వరకు పెట్టుబడులు పెడతారు. రైతు చేతికి పంట వచ్చే సమయానికి వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గించి వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా 10 నుంచి 30రూపాయల వరకు అమ్ముతుండగా, వ్యాపారులు రైతుకు రూ.2 కూడా ఇవ్వడంలేదు. మార్కెట్‌లో గురువారం 20 కిలోల టమోటా గంప రూ.40 పలకడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఒక ఎకరా టమాటా కోత కోయడానికే రైతుకు 6 మంది కూలీల అవసరం ఉంటుంది. ఒక్కో కూలీకి రూ.400 ఇస్తే రూ.2400 ఖర్చువుతుంది. మార్కెట్‌కు తరలించడానికి రవాణా చార్జి, ఇతర ఖర్చులు అదనం. కానీ పంట అమ్మగా పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదని రైతులు చెబుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి, అనేక కష్టనష్టాలకోర్చి పంట సాగుచేస్తున్న తమకు ప్రభుత్వం నుంచి తమకెటువంటి తోడ్పాటు లభించడం లేదని, అధికారులు, వ్యాపారస్తులు కమీషన్లకు కక్కుర్తిపడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల తీసుకొచ్చిన పంటను మార్కెట్లోనే కింద పారబోయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఈ ప్రాంతంలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ గుర్తొస్తుందని, కేవలం హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల కష్టాలను గుర్తించి టమాటాకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

టమాటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి: ఏపీ రైతుసంఘం

టమాట పంటను ప్రభుత్వమే రైతుల నుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం నేతలు కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో టమాటాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రామచంద్రయ్య మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్నారని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులు పండించిన టమాటా పంటను కిలో రూ.20 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తికొండలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లయితే... రైతులకు సరైన ధరతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, నియోజకవర్గ అధ్యక్షుడు కారన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, నాయకులు నెట్టి కంటయ్య, ఎం.కే.సుంకన్న, జొహరాపురం కాశి,మాదన్న, రాజప్ప, పులి వెంకటరామ వర్మ, రవి, నజీర్, యాటకల్లు ఆంజనేయ పాల్గొన్నారు.

వైసీపీలో 'మద్యం' కలకలం

(మొదటిపేజీ తరువాయి)

వేసి అవినీతి కార్యకలాపాలు చేపట్టారంటూ ప్రతిపక్ష, పార్టీలు విమర్శిస్తున్నాయి. వాటిని విజయసాయి ఎప్పటికప్పుడు ఖండిస్తున్నారు. తన సొంత అల్లుడి అన్న ఢిల్లీ మద్యం కేసులో అరెస్టు అవ్వడంపై టీడీపీతోపాటు విపక్షాలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయి. ఈ అరెస్టుపై సీఎం జగన్, విజయసాయిరెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. ఈకేసులో అనవసరంగా విజయసాయిరెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ ప్రభుత్వ సజ్జల సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ నేత, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) వ్యాఖ్యానించారు.

రూ.77వేల కోట్ల మద్యం వ్యాపారం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మద్యం మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందనీ, సీఎం జగన్ ఆదేశాలతోనే మద్యం మాఫియాను నడుపుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై చాలా సార్లు వివిధ సంస్థలకు టీడీపీ ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. మద్యం కొత్తపాలసీ పేరుతో వైసీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో రూ.77వేల కోట్ల మద్యం వ్యాపారం చేసిందని సమాచారం. ఏపీబీసీఎల్ అధికారిక వెబ్ సైట్ నుంచి తీసుకున్న సమాచారం ప్రకారం మూడేళ్లలో రూ.70,230కోట్ల మద్యం వ్యాపారం కొనసాగింది. వైసీపీ నేతలకు సంబంధించిన కంపెనీల కల్తీ బ్రాండులను ప్రజలకు విక్రయిస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలున్నాయి. దీంతో మద్యం వ్యాపారం వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రదారులపై సీబీఐ, ఈడీ దృష్టి పెట్టాయి. ఢిల్లీ మద్యం మాఫియాలో కీలక పాత్రధారిగా ఉన్న శరత్ చంద్రారెడ్డి, విజయసాయిరెడ్డి అల్లుడికి స్వయాన అన్న కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. శరత్ చంద్రారెడ్డి దగ్గర పనిచేసే చిరుద్యోగుల పేరుతో షెల్ కంపెనీలు నడుపుతున్నారని తెలిసింది. గతంలో వైఎస్ రాజవేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అధికారులు, పారిశ్రామిక వ్యక్తులను సొంత ప్రయోజనాల కోసం వాడుకుని వాళ్లను చివరకు జైలు పాల్జేశారనే విమర్శలున్నాయి. వారిలో ఇండియా సిమెంట్స్ అధినేత శ్రీనివాసన్, సత్యం రామలింగరాజు, నిమ్మగడ్డ ప్రసాద్ బలయ్యారని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

వైసీపీ నేతలు ఏం సమాధానం చెబుతారు? పంచుమర్తి అనూరాధ

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో జగన్ రైట్ హ్యాండ్ ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడి అన్న శరత్ చంద్రారెడ్డిని ఈడీ అరెస్ట్ చేయడంపై వైసీపీ నేతలు ఏం సమాధానం చెబుతారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంచుమర్తి అనూరాధ ప్రశ్నించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. అరెస్టయిన శరత్ చంద్రారెడ్డి అరబిందో ఫార్మా ఎండీగా ఉన్నారనీ, మద్య పాన నిషేధంపై గొప్పలు చెప్పే జగన్...ఈ అరెస్ట్ వ్యవహారంపై ప్రజలకు, ప్రతిపక్షాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో అంచెలంచెలుగా మద్యపానం నిషేధిస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక అంచెలంచెలుగా మద్యం మాఫియాను పెంచి పోషించారనీ, మూడున్నరేళ్లుగా ఇసుక, గనులు, మద్యం, బియ్యం, అంబులెన్స్ మాఫియాలు నడిపిన జగన్...వైద్య రంగం, ప్రజారోగ్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్ మద్యం మాఫియాకు మహిళల మాంగల్యాలు తాకట్టు పెట్టారనీ, కల్తీ మద్యంతో వేలాదిమంది ప్రాణాలను బలిగొన్నారనీ విమర్శించారు.

పోర్ట్, ఎస్ఈజెడ్‌లలో పెట్టుబడులపైనా విచారించాలి: ఎపీ రఘురామకృష్ణంరాజు

కాకినాడ పోర్ట్, ఎస్ఈజడ్‌లలో అరబిందో కంపెనీ పెట్టుబడులపై విచారించాలని ఎంపీ కె.రఘురామకృష్ణరాజు డిమాండ్ చేశారు. సీఎం జగన్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో 60 నుంచి 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను పినాక సోదరులు పెట్టుబడుల రూపంలో పెట్టారన్నారని, వారి కుటుంబానిది అన్ని జాయింట్ వ్యాపారాలేనని గుర్తుచేశారు.

విశాఖపట్నంలో పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేశారని, ఈ పెట్టుబడులను పరిశీలించి, పరిశోధించాలని ప్రధాని మోదీకి తాను ఒక లేఖ రాయనున్నట్లు తెలిపారు. ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా నిర్వహించనున్న సభా ఏర్పాట్లన్నీ తానై పర్యవేక్షిస్తున్నట్లుగా హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల మద్యం వ్యాపారాన్ని అడాన్ డిస్టలరీ కంపెనీ నిర్వహిస్తోందన్నారు. అడాన్ డిస్టలరీ కంపెనీ కార్యాలయం, అరబిందో ఫార్మా కార్యాలయం బిల్డింగులోనే ఉందని పేర్కొన్నారు.

వేమన విగ్రహం తొలగింపు అవివేకం

అభ్యుదయ రచయితల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యోగి వేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహాన్ని తొలగించి, అక్కడ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పెట్టడం ప్రభుత్వ అవివేకమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు ఓబులేసు, రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. యోగి వేమన విఖ్యాత ప్రజాకవి, సమాజంలో ఉన్న రుగ్మతలపై తన కలాన్ని ఆటవెలది రూపంలో ఎక్కుపెట్టి సాధారణ ప్రజలు సైతం నేటికీ వాటిని వాడుకలో పెడుతున్న విషయం విదితమేనన్నారు. 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడపలో వేమన విశ్వవిద్యాలయానికి అంకురార్పణ చేశారన్నారు. ఈ మధ్యనే విశ్వవిద్యాలయ పని విధానాన్ని, పాలన, బోధన అంశాలపై కమిటీ తనిఖీ చేసి ఏ-ధ్రువీకరణ పత్రం ఇచ్చిందని గుర్తు చేశారు. ఎందరో కవులు, రచయితలకు మార్గదర్శులైన వేమన విగ్రహాన్ని తొలగించి అక్కడ రాజశేఖరరెడ్డి విగ్రహం పెట్టడం తగదన్నారు. వేమన విగ్రహాన్ని ప్రాధాన్యత లేని ఎక్కడో పెట్టడం పూర్తిగా ఆక్షేపణీయమని అన్నారు. చేసిన తప్పును వెంటనే అధికారులు సవరించుకోవాలన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని యథాతథంగా వేమన విగ్రహాన్ని పున:ప్రతిష్టంపజేయాలని డిమాండ్ చేశారు.

నీరు-చెట్టు బకాయిలు చెల్లించండి: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హైకోర్టు తీర్పును సైతం అమలు చేయకపోవడం ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ నేతృత్వంలో నీరు-చెట్టు, నరేగా ఫిర్యాదుల విభాగం బాధ్యులు అచ్చెన్నాయుడుతో ఫిర్యాదుల విభాగాల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు-చెట్టు బిల్లులు అందక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారనీ, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. నిధుల విడుదలకు జూన్‌లో జీవోలు ఇచ్చి రైతుల ఖాతాలకు ఇప్పటివరకు నగదు జమ చేయకపోవడం దారుణమన్నారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే ధిక్కార పిటిషన్లు వేసి పనులు చేసిన రైతులకు అండగా ఉండాలని నీరు చెట్టు ఫిర్యాదుల విభాగానికి సూచన చేశారు.

రాష్ట్రానికి భారీ వర్ష సూచన

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: శ్రీలంక తీరాన నైరుతి బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడిన అల్పపీడనం వచ్చే 24 గంటల్లో మరింతగా బలపడే అవకాశం ఉందని విశాఖ వాతావరణశాఖ అధికారులు గురువారం తెలిపారు. ఇది నవంబర్ 12 తేదీ ఉదయానికి వాయువ్య దిశగా కదిలి తమిళనాడు పుదుచ్చేరి తీరం వైపు వెళ్లే అవకాశం ఉందని, 13వ తేదీన పశ్చిమ వాయువ్య దిశగా కదిలి తమిళనాడు పుదుచ్చేరి, కేరళ మీదుగా పయనించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా మధ్య బంగాళా ఖాతం నుంచి నైరుతి బంగాళాఖాతం మీదుగా అల్పపీడన ప్రాంతంతో అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి బలహీన పడిందని తెలిపారు. దీని ప్రభావంతో 11 తేదీ నుంచి 13వ తేదీ వరకు రాయలసీమ, దక్షిణ కోస్తా ఆంధ్రాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అంగీకరించం

- వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రధాని ప్రకటించాలి
- విశాఖలో అఖిలపక్షం ఆందోళన

విశాలాంధ్ర-విశాఖ: విశాఖ ఉక్కు పరిరక్షణ, ఏపీ పునర్విభజన సమస్యలపై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మోదీ పర్యట నను పురస్కరించుకొని విపక్షాలు గురువారం విశాఖలో ఆందోళనకు దిగాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అంగీకరించేది లేదని స్పష్టం చేశాయి. సీపీఐ, సీపీఎం, తెలుగుదేశం పార్టీ, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ), కాంగ్రెస్, ఆప్, లోక్‌సత్తా, ఎంసీపీఐ అధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన, తర్వాత సభ జరిగింది. ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని, 8500 మంది ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, 100 శాతం ఉత్పత్తి జరిగేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, స్టీల్‌ప్లాంటుకు సొంత ముడి ఇనుము గనులు కేటాయించాలని, ఏపీ పునర్విభజన చట్టం 2014లో పేర్కొన్న ఏపీకి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని, జాతీయ ప్రాజెక్టు పోలవరానికి నిధులు విడుదల చేసి సకాలంలో పూర్తి చేయాలని, ఏడాదికి రూ.8500 కోట్ల ఆదాయం సమకూరుస్తున్న వాల్తేరు రైల్వే డివిజన్ తరలింపును ఆపాలని, దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఎప్పుడు ప్రారంభమవుతుందో చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, కె.లోకనాధం, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గండి కనకరాజు, ఆప్ రాష్ట్ర మహిళా కన్వీనర్ సీతల్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జి.గోవింద రావు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, లోక్‌సత్తా జిల్లా నాయకులు సుధీర్‌కుమార్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపదని నాయకులు స్పష్టంచేశారు. విశాఖ ఉక్కును త్యాగాలతో ప్రజలు సాధించుకున్నారని గుర్తుచేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడమంటే ప్రజలకు ద్రోహం చేయడమేనని, జిల్లా, రాష్ట్ర అభివృద్ధిని ధ్వంసం చేయడమేనని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టాక ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను స్థాపించలేదని, అలాంటి మోదీకి విశాఖ ఊపిరి అయిన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. విభజన వలన తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ఏపీ పునర్విభజన చట్టం అంశాలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్నదని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ధ్వంసం చేసి గుజరాత్‌లో స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేస్తామని బీజేపీ ప్రకటించడం ప్రజలను వంచించటం తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, ప్రభుత్వ రంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రధాని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలిపివేత, విభజన చట్టం అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేసారు. విశాఖకు వస్తున్న ప్రధానితో రాష్ట్ర ప్రయోజనాలపై ప్రకటన చేయించాలని వైసీపీని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మౌనం వీడి ప్రధానితో స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన చేయించాల న్నారు. లేకపోతే బీజేపీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రజాద్రోహులుగా మిగులుతాయన్నారు.

సీపీఐ నాయకులు ఎం.పైడిరాజు, ఎస్‌కే రెహమన్, సీపీఎం నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.జగన్, ఆప్ నాయకులు ఎస్.రమేశ్‌కుమార్, కాంగ్రెస్ నేత సుధాకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆందోళన చేస్తున్న రాజకీయ పార్టీలు, కార్మిక ప్రజాసంఘాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగడం దారుణమని విమర్శిం చారు. ఆందోళనకారులను అరెస్టు చేయడం, ఆందోళనలను భగ్నం చేయడం సరికాదని హితవు పలికారు. ప్రజల హక్కులను కాల రాయడం ఆపకుంటే ప్రభుత్వమే అశాంతిని ప్రేరేపించినట్ల వుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బి.రమణి, బి.జగన్, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, సీఎస్‌కే పాల్ పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా కొమ్మినేని బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, అంబటీ రాంబాబు, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, డొక్కా మాణిక్యవరప్రసాద్, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు, తెలుగు అకాడమీ చైర్మన్ లక్ష్మీపార్వతి తదితరులు హాజయ్యారు. ఈ సందర్భంగా కొమ్మినేనిని మంత్రులు శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా కొమ్మినేని రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. కొమ్మినేని మాట్లాడుతూ, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చానని చెప్పారు. తనపై నమ్మకంతో ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు.

సీఎంను కలిసిన కొమ్మినేని : ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఎం జగన్‌ను కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. తనను ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించినందుకుగాను సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సీఎంకు కొమ్మినేని పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఎంను కలిసిన ఎంపీ గోరంట్ల, మాదాసి కురువ సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, మదాసి కురువ, మదారి కురువ సంఘాల ప్రతినిధులు సుంకన్న, శివలింగ, సోమలింగ, సాయిరామ్, మద్దిలేటి గురువారం కలిశారు. ఇప్పటివరకు మదాసి కురువ, మదారి కురువ కులాలకు ఇచ్చే కుల ధ్రువీకరణ పత్రాన్ని ఆర్డీవో పరిధి నుంచి తహసీల్దార్ పరిధిలోకి మారుస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ నిర్ణయం తమకెంతో ప్రయోజనకరమని కురువ సంఘాల ప్రతినిధులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కురువ సాంప్రదాయం ప్రకారం కంబలి కప్పి సీఎంను సన్మానించారు. తమ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.

జీఓ 21 రద్దు చేయాలి

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: రవీంద్రనాథ్

గుంటూరులో ఆటో కార్మికుల ప్రదర్శన

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. గుంటూరు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి నాజ్ సెంటర్ వరకు గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 21తో పాటు పెండింగ్‌లో ఉన్న పోలీస్ ఈ-చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గోతులమయమైన రోడ్లను పక్కాగా వేసి, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రీన్ టాక్స్ రోడ్ టాక్స్, టోల్ ప్లాజా ఫీజులు రద్దు చేయాలని, సీఎన్‌జీ గ్యాస్ ధరలు నియంత్రిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకాన్ని ఆటో కార్మికులందరికి వర్తింప చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవా ధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఫైనాన్సర్ సిండికేట్ల వ్యవస్థ వడ్డీలకు చక్రవడ్డీలు వసూలు చేస్తున్నారని, వీరి నుంచి కార్మికులకు విముక్తి కల్పించి బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీతో రుణాలను ఇప్పించాలన్నారు. ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి పీఎఫ్, ఈఎస్‌ఐలతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ(బుజ్జి), ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంత రావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, నందూరి రోశయ్య, ఎస్‌కే లాల్ బుడే, సాంబ శివరావు, నాగ రమేష్, యూసఫ్ నాగరాజు, సందీప్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బెడద లేకుండా ముందస్తు చర్యలు

విశాలాంధ్ర-పార్వతీపురం: గజరాజుల వల్ల ప్రజలకు హాని కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పార్వతీపురం అటవీఅధికారి పి.త్రినాథరావు, ఏనుగుల పర్యవేక్షణ విభాగం అటవీ అధికారి పీ రాజ బాబు గురువారం తెలిపారు. గతనెల31న విశాలాంధ్ర దినపత్రికలో 'గజరాజులతో గండం' పేరుతో వచ్చిన వార్తపై స్పందించిన అధికారులు ఈ మేరకు ప్రకటన చేశారు. ఏనుగులు సంచరిస్తున్న గ్రామాల్లో ముందుగానే దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. అటవీసిబ్బంది, ఎలిఫెంట్ ట్రాకర్స్, బేస్ కేంప్ వాచర్లు ఒక బృందంగా ఏర్పడి ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా అప్రమత్తం చేస్తున్నామని వెల్లడించారు. ఏనుగుల విధ్వంసం కారణంగా పార్వతీపురం పరిధిలో పంట నష్టపోయిన 2,434 మంది రైతులకు రూ.1,58,55,630 లను నష్టపరిహారంగా అందజేసినట్లు అధికారులు తెలిపారు. 251మంది రైతులకు చెల్లించాల్సిన రూ.1,99,08,200లను నిధులు విడుదలైన వెంటనే చెల్లిస్తామని వివరించారు. గజరాజుల దాడిలో గాయాలపాలైన 5 మందికి రూ. 3,85,852 లను, మరణించిన 5 మందికి రూ. 20 లక్షలు చెల్లించామని, ఇంకో రూ.5 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. దాడిలో మరణించిన 8ఆవులు, దూడలకు రూ.1.25 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలోనే వాటిని బాధితులకు చెల్లిస్తామని తెలిపారు. బలిజపేట మండలం మిర్తివలస గ్రామంలో రెండు ఆవులు మృతిచెందాయని, వాటివిలువ రూ.91 వేలుగా పశుసంర్థక వైద్యులు నిర్ణయించినట్లు నివేదిక సమర్పించామని వివరించారు.

బాధిత చిన్నారుల వివరాల వెల్లడి చట్ట విరుద్ధం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: చిన్నారులపై లైంగిక వేధింపులు, అసాంఘిక కార్యకలాపాలు వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధితుల ఫొటోలు, పేర్లు, వారి తల్లిదండ్రుల ఫొటోలు, పేర్లు, చిరునామా తదితర విష యాలను బహిర్గతం చేయడం, ప్రచురించటం చట్ట విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వారికి సంబంధించిన ఏ విచారణ, పరిశోధన, న్యాయ ప్రక్రియ వంటి సందర్భా ల్లోనూ వివరాలు తెలియజేయ కూడదని పేర్కొన్నారు. అలా తెలియజేస్తే వారిని గుర్తించేం దుకు అవకాశం ఉందనీ, ఈ విషయాలను ఏ వార్తా పత్రికలు, ఛానల్స్ లేదా సోషల్ మీడి యాకు అందజేయడం, బాలల ఫొటోలు, పేర్లు ప్రచురించడం నిషేధమని చెప్పారు. అలాగే బాధితులను విచారించేటప్పుడు పోలీసులు, సంబంధిత అధికారులు నిబంధనలు పాటించాలని సూచించారు. బాధిత బాలల విషయంలో అధికారులు చట్ట ప్రకారం వ్యవహరించాలని అన్నారు. బాలల న్యాయ చట్టం 2015 సెక్షన్-74(1) ప్రకారం గోప్యత, గుర్తింపు అంశాలను ఉల్లంఘన చేసినట్లు అయితే చట్ట ప్రకారం నేరమని హెచ్చరించారు.

నేటి నిరసనలు జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రధాని మోదీ శుక్రవారం విశాఖలో చేపట్టే పర్యటనకు వ్యతిరేకంగా సీపీఐ ప్రజా సంఘాలు చేపట్టే నిరసనలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సీపీఐ ప్రకాశం జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. సీపీఐ నాయకులు కె వీరారెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన ఈశ్వరయ్య మాట్లాడారు. రెండేళ్ల నుంచి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీ కరించదాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమాలు చేయబడు తున్నా, కేంద్రం కనీస స్పందించలేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ త్యాగాల పునాదులపై నిర్మితమైందన్నారు. అలాంటి పరిశ్రమను విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం చూస్తోం దనీ, దీనిని వ్యతిరేకిస్తూ అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏకతాటిపైకి వచ్చి నిరసనలు తెలుపుతుంటే వైసీపీ మాత్రం మొసలి కన్నీరు కారుస్తూ నాటకాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి మోదీ ద్రోహం చేశారని, వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా ద్రోహం చేశారని, ప్రత్యేక హోదా ఇవ్వకుండా నట్టేట ముంచారని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా వం చించారని దుయ్యబట్టారు. మోదీ సభకు మూడు లక్షల మందిని తరలించడమే లక్ష్యంగా జగన్ పనిచేస్తున్నారనీ, రాజు దగ్గర బంటులా జగన్ మారారన్నారు. మోదీ, జగన్ పాలన దొంగ లు, దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా తయారైందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై శుక్రవారం సీపీఐ, ప్రజా సంఘాలు నిర్వహించే నిరసనలను జయ ప్రదం చేయాలని కోరారు. సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ వెంకట్రావు, వై రవీంద్రబాబు, బీ శ్రీను, కార్యవర్గ సభ్యుడు బీ హనుమారెడ్డి, ఎస్‌డీ మౌలాలి, ఎం రమేష్, నల్లూరి మురళి, కేవీ కృష్ణ గౌడ్, ఆర్ రామకృష్ణ, పీ ప్రభాకర్, ఎం విజయ, పి గోపీ, గిద్దలూరు నియోజకవర్గం బాధ్యుడు కే రమణ పాల్గొన్నారు.

రెండుకోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు

25న పార్లమెంట్ మార్చ్... పోస్టర్ల విడుదల

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని నమ్మబలికి మాట తప్పిన ప్రధాని మోదీ... అబద్ధాల నేతగా చరిత్రలో నిలిచి పోతారని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు విమర్శించారు. నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబరు 25 న దిల్లీలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు లెనిన్ బాబు తెలిపారు. మార్చ్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నిరుద్యోగ యువతకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో దేశంలో నిరుద్యోగం పెరిగిందని, నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ వారి పొట్టలు కొడుతున్నారని కేంద్రంపై విరుచుకు పడ్డారు. రైల్వే, ఎల్‌ఐసీ, బీఎస్‌ఎన్‌ఎల్, విమానయాన సంస్థలు సహా లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి యువతను రోడ్లపై పడవేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ఉన్నత విద్యావంతులు ఉద్యోగాల కోసం పోరాటం చేస్తే పకోడీబండి పెట్టుకోవాలని ఉచిత సలహాలు ఇవ్వడం దారుణమన్నారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించి, యువతకు నైపుణ్యమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని దుర్మార్గపు పాలనపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ లో ఎలా పర్యటిస్తారని సూటిగా ప్రశ్నించారు. 'గో బ్యాక్ మోదీ' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి సంయుక్తంగా మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణల పేరుతో నూతన విద్యా విధానాన్ని తీసుకురావడం నిరంకుశత్వమని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయంగా సైన్స్ ప్రాచుర్యం పొందుతున్న నేపథ్యంలో మూఢనమ్మకాలను బలపరిచే విధంగా నూతన విద్యా విధానం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయి స్వామి, ఏఐవైఎఫ్ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి ధనుంజయ, నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, మోహన్ కృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు మహేష్, రమణ, ఏఐవైఎఫ్ నగర నాయకులు నిఖిల్, వినయ్, శ్రీకాంత్,ఆలీ, షకీల్, చాంద్, ఏఐఎస్‌ఎఫ్ నగర నాయకులు వంశీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతో పవన్ భేటీ?

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం రాత్రి 7 గంటలకు విశాఖ చేరుకోనున్న నేపథ్యంలో, ఆయనతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా భేటీ కానున్నారని విస్తృతంగా ప్రచారం సాగుతోంది. అయితే అధికారికంగా అటు బీజేపీ, ఇటు జనసేన ప్రకటించలేదు. దీంతో వీరిద్దరి భేటీపై రాజకీయ వర్గాల్లో చర్చనెలకొంది. ఇటీవల విశాఖలో జరిగిన పరిణామాల నేపథ్యంలో అటు పోలీసు వర్గాల్లో కూడా అలజడి మొదలైంది. రాష్ట్రంలో పరిస్థితులు, తాజా రాజకీయాలపై వీరిద్దరు చర్చించే అవకాశముందని సమాచారం. మూడు రాజధానుల అంశం, విశాఖ కేంద్రంగా జరుగుతున్న భూ కుంభకోణాలతోపాటు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పవన్ మోదీతో ప్రస్తావిస్తారని ప్రచారం సాగుతోంది. విశాఖలో బీజేపీ నిర్వహించే ర్యాలీలో పవన్ పాల్గొంటారా? లేదా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. రోడ్ షోలో పవన్ కళ్యాణ్ ఉంటే జన సమీకరణ బాగుంటుందన్న అభిప్రాయం బీజేపీలో వ్యక్తమైనట్లు సమాచారం. దీంతో విశాఖపట్నంలో పోలీసులకు మరో టెన్షన్ మొదలైనట్లు కనిపిస్తోంది. ప్రధానమంత్రి మోదీ, సీఎం జగన్ మోహన్ రెడ్డి పర్యటన బందోబస్తులో ఇప్పటికే తలమునకలై విధులు నిర్వహిస్తున్న పోలీసులకు పవన్ రోడ్ షోలో పాల్గొంటే బందోబస్తు నిర్వహించడం సవాల్‌గానే మారుతుందని పోలీస్ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి విశాఖ స్ఫూర్తిదాయకం

637వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: దేశవ్యాప్త ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి విశాఖ ఉక్కు ఉద్యమం స్ఫూర్తిదాయకమని స్టీల్ ఆఫీసర్స్ ఫెడరేషన్ పూర్వపు నాయకుడు డాక్టర్ డిఎన్ శర్మ, ఏఐటీయూసీ ఫెడరేషన్ నాయకుడు రామ్ అగార్ సింగ్ అన్నారు. స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు గురువారం 637వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతోందని, కార్మికవర్గం ఐక్యంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ప్లాంట్‌లోని బి.ఎఫ్-3 ను మిగిలిన విభాగాలను తక్షణమే పునఃప్రారంభించాలని, 7.3 మిలియన్ టన్నులకు అనుగుణంగా ఉత్పత్తి ఉండాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ ఛైర్మన్ డి. ఆదినారాయణ, నాయకులు ఎన్.రామారావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, గుమ్మడి నరేంద్ర, డి.హెచ్.వెంకటేశ్వరరావు, జీ జయ, బి.ఎన్. రాజు, రమణ పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కుట్రలు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ- జనసేన-ఎల్లో మీడియా కుట్రలకు సంబంధించి రాష్ట్రంలో కొత్త ట్రెండ్ కనిపిస్తోందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్టోబరులో విశాఖ పట్నంలో విశాఖ గర్జన జరిగిందనీ, అదేరోజు పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో విమానాశ్రయం వద్ద మంత్రులు, వైసీపీ నాయకులపై దాడి జరిగిందని గుర్తుచేశారు. ఆ తర్వాత పరిణామాలు చూస్తే పవన్ కల్యాణ్ విశాఖలో చేసిన డ్రామా, ఆ తర్వాత విజయవాడ నోవా టెల్‌లో పరామర్శ పేరుతో పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు కలిశారని పేర్కొ న్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అంటూ జగన్‌ను వెంటనే కుర్చీ నుంచి దించేయ డానికి అన్ని శక్తులు ఏకం కావాలని వారు పిలుపు నివ్వడం, మళ్లీ వాళ్లు వెనక్కి వెళ్లడం చూశామన్నారు. తాజాగా వాయిదాల పద్ధతిలో ఇప్పటం గ్రామానికి...పరామర్శ పేరుతో పవన్ కల్యాణ్, ఆ తర్వాత నారా లోకేశ్ పర్యటనలు చూశామని వివరించారు. అంతకు ముందు రోజే చంద్రబాబు నందిగామ పర్యటనలో తనపై రాళ్ల దాడి జరిగిందంటూ ఆరోపణలూ చూశామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వమని, అందుకు పొత్తులకు సిద్ధమని పవన్ డిక్లరేషన్ ఇవ్వడం, ఆ తర్వాత పొత్తులపై ఇంకా చర్చలే పూర్తి కాలేదని కొద్దిరోజులు, సమస్యలు ఉంటే కలిసి పనిచేస్తామని కొద్దిరోజులు చెప్పుకొచ్చా రని, మళ్లీ ప్రజాస్వామ్య పరిరక్షణకు కలుస్తున్నామని చెప్పడం చూశామని సజ్జల తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ అంటే, దానికి భంగం కలిగించే సంఘటనలు సృష్టించడం, ఎక్కడో క్షేత్రస్థాయిలోనో, వ్యక్తిగత తగాదాలనో తెరమీదకు తెచ్చి... అన్యాయం జరిగిందంటూ చెప్పే ప్రయత్నం వీరంతా కలిసికట్టుగా చేస్తున్నారని దుయ్యబట్టారు.

గదబ ఆదివాసీ రైతుల హక్కులు కాపాడండి

హెచ్‌ఆర్‌ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విశాఖపట్నం: గదబ ఆదివాసీ రైతుల హక్కులు కాపాడాలంటూ మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీ రఘు, ఏపీ-తెలంగాణ సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డివిజన్ గొలుగొండ మండలం పాతమల్లంపేటలో పర్యటించి, ఆర్‌ఎస్ నెంబర్ 850/1లో ఉన్న 36 ఎకరాల భూమిని, ఆదివాసీల వద్ద ఉన్న పాత, కొత్త రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మొత్తం 25 ఆదివాసీ కుటుంబాలు గత యాభై ఏళ్లుగా 36 ఎకరాలను సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. మెట్ట పంటలతో పాటు, జీడిమామిడి, మామిడి, టేకు, తాటిచెట్ల నుంచి వచ్చే ఫలసాయమే వారికి ప్రధాన జీవనాధారమన్నారు. ఈ ఏడాది మార్చిలో కొందరు ప్రవాస భారతీయులు, స్థానిక భూకబ్జా దారులు, రెవెన్యూ అధికారులు ముగ్గురూ కుమ్మక్కై ఈ 36 ఎకరాల భూమిని కాజేయాలనే ప్రయత్నం మొదలుబెట్టారని వారు ఆరోపించారు. దానిలో భాగంగానే తప్పుడు రెవెన్యూ రికార్డులు సృష్టించి, పోలీసుల ద్వారా బెదిరింపులు, వేధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. అప్పటి గొలుగొండ ఎస్సై ధనుంజయ నాయుడు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, ఆదివాసీ రైతులను, మహిళలను అర్ధరాత్రి వరకూ పోలీసుస్టేషన్లో బంధించి ప్రవాసభారతీయులు ఇచ్చే డబ్బు తీసుకుని భూమిని విడిచిపెట్టమని వత్తిడి చేశారని తెలిపారు. ఆనాటి గొలుగొండ తహసీల్దార్ కె.వెంకటేశ్వర రావు... మార్చి 29న నర్సీపట్నం ఆర్డీవోకు ఇచ్చిన నివేదికలో, జూన్ 15న అనకాపల్లి ఏడీ సర్వేయర్‌కు ఇచ్చిన నివేదికలో భూమి ఆదివాసీలు సాగు చేసుకుంటున్నారన్న వాస్తవాన్ని తొక్కిపెట్టా రన్నారు. కావాలనే ఈ తప్పుడు నివేదికలు ఇచ్చారని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా అక్టోబర్‌లో నర్సీపట్నం ఆర్డీవో ఈ భూమిని పరిశీలించారన్నారు. సర్వేనెంబర్ 850/1లో సాగుదారుల వివరాలను భూమి రికార్డుల్లో (3వ నెంబర్ అడంగల్, 13వ కాలంలో) నమోదుచేసి, ఆదివాసీ రైతులకు న్యాయం చేయాలని కోరారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన తహసీల్దార్, ఆదివాసులను బెదిరించిన ఎస్సైపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో గొలుగొండ సర్వేయర్, తహసీల్దార్ ఇచ్చిన నివేదికలను రద్దు చేస్తామని, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

ఇదీ మన న్యాయం

న్యాయం అందరికీ ఒకటేనంటారు. చట్టం ముందు అందరూ సమానులే అంటారు. బెయిలు హక్కు జైలు అరుదుగా అమలు చేయాలి అని అత్యున్నత న్యాయస్థానంలో ఆసీనులైన వారు హితవు పలుకుతారు. అయితే భీమా కోరేగావ్ కేసులో నాలుగేళ్లుగా నిర్బంధంలో ఉన్న మానవ హక్కుల కోసం పోరాడే వారికి, న్యాయవాదులకు, రచయితలకు, మేధావులకు, విద్యావేత్తలకు బెయిలు మంజూరు చేయడానికి మాత్రం ఎక్కడలేని అడ్డంకులు ఎదురవుతాయి. భీమా కోరేగావ్ కేసులో అరెస్టయిన స్టాన్‌స్వామి చివరకు నిర్బంధంలో ఉండగానే మరణించారు. ఆయన మృతి కస్టడీ మరణం కింద లెక్కకు రాలేదు. భీమా కోరేగావ్ కేసులో అరెస్టయిన 16 మందిలో ఒకరైన మానవ హక్కుల కార్యకర్త గౌతం నవలఖాను తలోజా జైలులో కాకుండా గృహ నిర్బంధంలో ఉంచడానికి సుప్రీంకోర్టు గురువారం అంగీకరించడం కూడా ఆనందించదగిన స్థితికి చేరుకున్నాం. న్యాయం, చట్టం అందరికీ ఒకటే అయినప్పుడు న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు భిన్నంగా ఎందుకుంటాయో అంతు పట్టదు. మరో వేపు హత్య, అత్యాచార ఆరోపణల కింద జైలుశిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చాబాబా గుర్మీత్ రాం రహీంసింగ్‌కు సునాయాసంగా పెరోల్ వస్తుంది. బెయిలూ ఇస్తారు. 2022 నాటి గుజరాత్ మారణకాండ సమయంలో బిల్కిస్ బానో, ఆమె తల్లిపై, కిరాతకంగా అత్యాచారం చేసి, ఆమె మూడేళ్ల కూతురిని బండకేసి బాది చంపినందుకు దోషులుగా తేలిన 11 మందిని "అమృత కాలం"లో జైలు నుంచి విడుదల చేస్తారు. విడుదలైన తరవాత వారికి సన్మానాలు చేస్తారు. మహమ్మద్ ప్రవక్తను తూలనాడినందుకు అరెస్టయిన తెలంగాణాలో బీజేపీ శాసనసభ్యుడు రాజాసింగ్‌కు బెయిలు మంజూరు అవుతుంది. మతోద్రిక్తతలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడకూడదన్న షరతు మాత్రమే విధించి బెయిలు మంజూరు చేస్తారు. విద్వేష ప్రసంగాలకు పేరుమోసిన యతి నరసింగానంద బెయిలు షరతులను ఎన్నిసార్లు ఉల్లంఘించినా పోలీసులు పట్టించుకోరు. ఆ విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లరు. అందువల్ల ఆయన నిరంతరం విద్వేష ప్రచారం కొనసాగిస్తూనే ఉంటారు. అక్రమ డబ్బు చెలామణి కేసులో శివసేన (ఉద్ధవ్ వర్గం) నాయకుడు సంజయ్ రౌత్‌కు బుధవారమే బెయిలు మంజూరు అయింది. అసలు ఆయన మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ కేసు పెట్టడమే చెల్లదని న్యాయమూర్తులు బాహాటంగా ప్రకటిస్తారు. అలాంటప్పుడు నిర్దోషిగా తేల్చకుండా బెయిలుమాత్రం మంజూరు చేయడంలో ఆంతర్యం ఏమిటో తెలియదు. మన న్యాయవిధానం ప్రకారం నిజంగానే బెయిలు హక్కు. కానీ నాలుగేళ్లకుపై నుంచి భీమా కోరేగావ్ కేసులో తలోజా జైలులో నిర్బంధంలో ఉన్నవారికి బెయిలు ఎందుకు మంజూరు కాదో తెలియదు. సుదీర్ఘ న్యాయపోరాటం తరవాత ఈకేసులో న్యాయవాది, గిరిజనుల సంక్షేమంకోసం పనిచేసే సుధాభరద్వాజ్‌కు మూడేళ్ల మూడు నెలలు ఎలాంటి విచారణాలేకుండా జైలులో మగ్గిన తరవాత 2022 జనవరిలో బెయిలు మంజూరైంది. కానీ దానికి బోలెడు షరతులు. ఆమె వృత్తిరీత్యా న్యాయవాది. కానీ బెయిలు వచ్చినా ఆమె తన పని తాను చేసుకోవడానికి న్యాయస్థానం అనుమతించదు. ఆమె బొంబాయిలోనే ఉండాలి. ప్రసిద్ధ కవి వరవరరావు పరిస్థితీ అదే. ఎనిమిదిపదులు దాటిన వరవరరావుకు ఆరోగ్య కారణాలవల్ల బెయిలు మంజూరు కావడానికి చాలా పోరాడవలసివచ్చింది. 2021లో ఆయనకు ఆరోగ్యకారణాలవల్ల బెయిలు మంజూరు చేశారు. గత సెప్టెంబర్‌లో మామూలు బెయిలు వచ్చింది. ఆయనా బొంబాయి వదిలి వెళ్లడానికి వీలులేదు.

73 ఏళ్ల గౌతం నవలఖా కాన్సర్ వ్యాధితో బాధ పడ్తున్నారు. స్టాన్ స్వామికి పట్టిన గతే తనకూ పట్టగూడదనుకున్నారు. అందుకే తనను కనీసం గృహనిర్బంధంలో ఉంచండి అని మొరపెట్టుకుంటే బుధవారం సుప్రీంకోర్టు కరుణించింది. కానీ విధించిన షరతులు పరిశీలిస్తే అవి ఎంత కఠినమైనవో అర్థం అవుతుంది. జైలులో ఉన్నప్పుడు ఆయన చదువుకోవడానికి హాస్యరచయిత ఉడ్‌హౌజ్ పుస్తకం ఆయన కుటుంబం పంపిస్తే జైలు అధికారులకు అది అత్యంత ప్రమాదకరంగా కనిపించి ఆయనకు అందజేయలేదు. ఇది హాస్యాస్పదంగా ఉంది అని న్యాయ మూర్తులు వ్యాఖ్యానించారు. దానివల్ల ఆయనకు కలిగిన ప్రయోజనం ఏమీలేదు. నవలఖా తీవ్రమైన నొప్పితో బాధపడ్తున్నా కనీసం ఆయన కూర్చోవడానికి జైలు అధికారులు ఓ కుర్చీ అయినా ఏర్పాటు చేయలేదు. ఆయన కళ్లజోడు ఎవరో దొంగిలిస్తే ఆయన కుటుంబం మరో కళ్లజోడు పంపితే జైలు అధికారులు వాటిని తీసుకుని ఆయనకు అందించడానికి కూడా అంగీకరించలేదు. నిందితులు జైలులో ఉన్నప్పుడు కనీస వసతులైనా ఉండేట్టు చేయడం ఈ కేసును కొనసాగిస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ బాధ్యత అని న్యాయమూర్తి శుక్రే అన్నారు. తలోజా జైలులో పరిస్థితి దారుణంగా ఉంటుందని అందరికీ తెలుసు. అయినా జైలులో అవసరమైన మార్పులు చేయరు. జైళ్లు నివాస యోగ్యంగా ఉన్నాయో లేవో జ్యుడీషియల్ కస్టడీకి పంపే న్యాయ మూర్తులు పట్టించుకోరు. నవలఖాను ఇంతకు ముందు కూడా గృహ నిర్బంధంలో ఉంచిన సందర్భాలున్నాయి. అయితే ఆయన మళ్లీ జైలుకెళ్లక తప్పలేదు. ఇప్పుడు 48గంటలలోగా ఆయనను గృహ నిర్బంధంలో ఉంచాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కె.ఎం.జోసఫ్, హృషీకేశ్ రాయ్ బుధవారం ఆదేశించారు. అయితే ఆయనను గృహనిర్బంధంలో ఉంచడానికి విధించిన షరతులు జైలుశిక్ష కన్నా తీవ్రంగా ఉన్నాయి. ఆయన ఇంటి ముందు పోలీసుల కాపలా ఉంటుంది. పోలీసులను నియమించడానికి అయ్యే ఖర్చు ఆయనే భరించాలట. ఆయన జైలునుంచి గృహనిర్బంధంలోకి వెళ్లాలంటే శుక్రవారంలోగా 2,40,000 రూపాయలు చెల్లించాలి. ఆయన ఇంటి చుట్టూ సి.సి.కెమెరాలు బిగిస్తారు. ఆయన తిరిగే గదుల్లోనూ ఈ కెమెరాలు ఉంటాయి. నవలఖా ఇంటి నుంచి వాహ్యాళికి తప్ప బయటకు అడుగుపెట్టకూడదు. అప్పుడూ పోలీసులు వెంట ఉంటారు. అలా బయట నడిచేటప్పుడు ఎవరితోనూ మాట్లాడకూడదు. ఇంటర్నెట్, ఫోన్ లాంటివి ఆయనకు అందుబాటులో ఉండవు. అయితే రోజుకు ఒకసారి పదినిమిషాలసేపు ఫోన్లో మాట్లాడవచ్చు. అదీ పోలీసులు అందించే ఫోన్లో మాత్రమే. ఆయన కుటుంబసభ్యులు ఇద్దరు మాత్రమే వారానికి ఒకసారి మూడుగంటల పాటు ఆయనను కలుసుకోవచ్చు. ఆయన కేబుల్ టీవీ చూడొచ్చు. పత్రికలు చదవొచ్చు. ఇన్ని షరతులు జైలులో కూడా ఉండవేమో! ఈ షరతులు విధించిన న్యాయమూర్తులు నాలుగేళ్లైనా భీమా కోరేగావ్ నిందుతుల విచారణ ఎందుకు ప్రారంభంకాలేదు అని ఒక్కమాట కూడా అడగలేదు. ఇదీ మన న్యాయం.!

భక్తి-ఆశ-భయం

రా బావ ఏంటి నిన్న రాలేదు. ఊరెళ్లావా, ఒంట్లో బాగాలేదా. అదేం కాదు బావ దైవ దర్శనానికి వెడితే భక్తుల తొక్కిసలాటలో కిందపడితే దెబ్బలు తగిలాయి. అరె అదేంటి ఎక్కడికెళ్లావు. ఎవరా దేముడు. ఎక్కడో కాదు బావ మా పేటలో కొత్తగా రామాలయం నిర్మాణం జరిగింది. అది సరె బావ నాకు తెలియక అడుగుతాను సినిమా టికెట్టుకు తోసుకున్నట్లు దైవ దర్శనానికి కూడ తోసుకోవాల బావ. చూడు బావ హద్దుమీరిన భక్తి మార్గం ద్వారా హద్దు తప్పిన జీవన విధానాన్ని ఆస్థికత్వం నేర్పింది. దారి తెలియని సామాన్యులకు ఆశ, భయం అనే రెండు అంశాలను ప్రవేశపెట్టి మానసికంగా మనిషిని బలహీనుణ్ని చేసింది. దాన్ని ఆధారం చేసుకుని వ్యక్తుల వ్యక్తిత్వాలను దెబ్బతీసింది. అది సరె బావ కార్యాకారణ సంబంధాలపై ప్రశ్నించిన వారిపై నాస్తిక ముద్రవేసి సమాజంలో పక్కన పెడుతున్నారు కదా. అసలు ప్రశ్నించకపోతే ప్రగతి లేదంటావు అదేంటి బావ. అదె బావ మనిషి మానసిక బలహీనతను దృష్టిలో ఉంచుకొని ఒక దేముని దగ్గర కోరిక తీరకపోతే మరొక దేముడున్నాడంటూ అనేక రూపాలతో అనేక దేముళ్లను సృష్టించి అనేక దేవాలయాలు నిర్మించి వాటి చుట్టూ తిప్పుతున్నారు. అది నిజమె నాకు తెలిసిన ఒక వ్యక్తి తన జబ్బు తగ్గకపోతే అన్ని గుళ్లు తిరిగి చివరకు శబరిమలై వెళ్లి చన్నీళ్లలో మునిగి చలిగాల్లో తిరిగి జ్వరంతో తిరిగివచ్చి మంచం పట్టాడు బావ. అదే బావ నేననేది భక్తితో యింట్లో పూజ చేస్తే ఆ దేముడు కరుణించడా అని. అయినా దేముడికి మొక్కేవారు ఎవరు సన్మార్గులో, ఎవరు దుర్మార్గులో ఆ దేముడికి తెలియదా బావ.

అది సరె బావ అసలు భక్తి అంటే ఏమిటి చెప్పు బావ. శ్రీకైవల్య

పథంబు చేరుటకై చింతించెదన్ అన్నారు పోతనామాత్యులు. భక్తి ద్వారా కైవల్యానికి చేరవచ్చునని నమ్మిన భక్తులు అలా ఆచరిస్తారు. అసలు భక్తి పూజలు ఎవరికి చెయ్యాలి అనేది తత్వ సంబంధమైనది. కాని కైవల్యం ఎక్కడుంది ఎలా చేరాలి అనే ప్రశ్నకు భక్తి ద్వారానే అని ఆస్థికులు చెబుతారు బావ. అది సరె భగవంతుడు అణువణువునా ఉంటాడంటారని, ఇందు కలడందు లేడనె సందేహం వలదంటారుగ బావ. నిజమె బావ భగవంతుడు సర్వ వ్యాప్తుడై పిపీలాది బ్రహ్మ పర్యంతం నిండి నిభిడీకృతమైన విష్ణు తత్వాన్ని వైకుంఠంలో కూర్చోపెట్టి కైవల్యం అక్కడే ఉందని అక్కడకు చేరడానికి దైవభక్తి ఒక్కటె మార్గమని ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతులు ప్రజలకు ముఖ్యంగా భక్తులకు బోధించారు బావ. అది సరె బావ భక్తి పూజలు ఎలా చెయ్యాలి బావ. భక్తి పేరుతో బాహ్య కార్యక్రమాలకు లక్షల కొద్ది వ్యయం చేయడమె భక్తి కాదు బావ. రాజకీయ నాయకులు కూడ అలాగే ఖర్చుతో పూజలు చేస్తున్నారు బావ.

గుడిలోని విగ్రహానికి నమస్కరించి, కొబ్బరికాయ కొట్టి. అగరొత్తులు వెలిగించి, గంట మోగించి, విగ్రహం పాదాల వద్ద పూలు ఉంచి, పూజారి ఆశీర్వాదం తీసుకోవడమె ప్రస్తుతం భక్తిగా చెబుతున్నారు బావ. దాంతో పాటు పుణ్యక్షేత్రాలు దర్శించుకోవడం భక్తిలో భాగంగా భావిస్తున్నారు. అది సరె బావ నిర్వికల్ప స్థితిలో అంటే సమాధి స్థితికి చేరి తిరిగి జాగ్రదావస్థకు చేరిన తరువాత సమాధి స్థితిలో ఏమి జరిగింది ఏమీ తెలియదని వివేకానందుడు అన్నాడుగా బావ. అందుకె నిరర్థక ఏకాగ్రత వల్ల ఉపయోగం లేదని మన ముందున్న అన్నార్తులను ఆదుకోవడమె ముఖ్యమని గురువు రామకృష్ణ పరమహంసను వదలి లోకమంతా చుట్టివచ్చాడుగ బావ. భక్తిపై శ్రద్ధపెట్టే మనిషి పరాధీనుడై యితరులపై ఆధారపడి తన శక్తిని కోల్పోయి అమూల్యమైన కాలాన్ని భక్తి పేరుతో దుర్వినియోగం చేయడం తప్పుగా భావించాడు బావ. రాష్ట్రపతి నుండి గల్లీ నాయకుల వరకు తిరుపతి వెళ్లి మొక్కడం చూసి తిండికి గడవనివాడు అప్పుచేసి తిరుపతి వెళ్లి ఆ అప్పు తీర్చలేక సతమతమవుతున్నాడుగ బావ. నిజమె బావ ఈ ఆస్థికులు వేదాంతులు ప్రతి మనిషిలోను దేవుడున్నాడని చెప్పాలి బావ. అలా చెబితె వారి ఆధిక్యత కోల్పోవలసి వస్తుందని అలా చెప్పరు బావ. మనిషికి అంతరంగ శక్తులు లేవని గ్రహించి అన్నింటికి మనిషే మూలమని తెలుసుకొని మనిషి ధీరోదాత్తుడు కావాలని వివేకానందుడు కాంక్షించారు. అలాగె కోట్లు గడించిన ఆశ్రమాలు సామాన్యులకు ఏ విధంగాను ఉపయోగపడవని అనిబిసెంటు నిర్మించిన ఆశ్రమాలు అనవసరమని దివ్యజ్ఞాన తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి ప్రపంచ పర్యటన చేశారు బావ. అది నిజమె బావ కాని భక్తి పేరిట అమాయకులను మభ్యపెట్టి ఆశ్రమాలు స్థాపించి అందలమెక్కే వారు రోజు రోజుకు పెరుగుతున్నారుగ బావ. నిజమే బావ నాయకులు ప్రతి చిన్న విషయానికి ప్రతి ప్రారంభోత్సవానికి పూజలు చేసి ప్రజల్లో మూఢ నమ్మకాలు పెంచుతున్నారు బావ. నిజమె బావ అసలు భక్తి అనేది మనసుకు సంబంధించినది. ఆస్థికులు ఆరాధ్యుడైన ఆది శంకారాచార్యులు నిన్ను నీవు తెలుసుకోవడమే భక్తి సారాంశం అని శిష్యులకు బోధిస్తారు బావ. దాదాపు వివేకానందుడు , జిడ్డు కృష్ణమూర్తి అదే దారిలో పయనించారు. తల్లిదండ్రులపైన, భార్యాపిల్లలపైన ఉన్న ప్రేమ మనసులో దాచుకున్నట్లే దైవంపై ఉన్న ప్రేమ దాచుకోవచ్చు. అంతేగాని భక్తి పేరిట భజనలు చేసి చక్రపొంగలి మనం తిని దేవునిపై భక్తి ఉన్నట్లు వెల్లడి చేయనవసరంలేదు బావ. మనిషికి బతుకు పట్ల ఉన్న ఆశ, భయం అనే వాటి వల్ల భక్తి బాటలోకి మనిషిని నెట్టుతున్నట్లు గ్రహించాలి బావ.

వ్యాస రచయిత సెల్: 9885569394

పౌరులపై ప్రభుత్వ నిఘా చట్టం

ప్రబీర్ పురకాయస్థ

పౌర హక్కులకు,స్వేచ్ఛకు, వ్యక్తి గోప్యతకు కత్తెర వేయడానికి బీజేపీ ప్రభుత్వం తహతహలాడుతూ ఉంటుంది. కొత్తగా గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన టెలి కమ్యూనికేషన్స్ బిల్లు 2022 ముసాయిదా ఈ విషయాన్ని మరోసారి ధృవ పరిచింది. ఇది పౌరులపై ప్రభుత్వ పూర్తి నిఘా చట్టం అవుతుంది. బిల్లుపై తూతూమంత్రంగా ప్రజాభిప్రాయం సేకరించడానికి ఈ పాలకులు బాగా అలవాటుపడ్డారు. ముసాయిదాలో పౌరులు, సర్వీసు ప్రొవైడర్లు (సేవలు అందించే) వాళ్లపైన ప్రభుత్వ అధికారాలను పెంచే అంశాలను చేర్చారు. ఇదే సందర్భంగా ప్రభుత్వం వ్యక్తిగత డాటా (సమాచారం) రక్షణనిచ్చే బిల్లును ఉపసంహరించుకున్నది. ఐదేళ్లుగా చట్టం చేయడానికి ప్రయత్నించి ఇప్పుడు ఉపసంహరించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి పుట్టుస్వామి తీర్పు ఆధారంగా పౌరుల గోప్యత హక్కులను రూపకల్పన చేసేందుకు ఉద్దేశించింది ఈ బిల్లు. అయితే ఇంత వరకు పౌరుల హక్కులను నిర్వచించలేదు అయితే ఈ బిల్లులో పౌరులు ఏమిచేస్తునారు, ఏమి వింటున్నారు? అనే విషయాలను ప్రభుత్వం తెలుసుకునేందుకు, వినేందుకు విస్తృత అధికారాలను పొందుపరిచారు. తాజాగా విడుదల చేసిన టెలికాం బిల్లులో టెలికం క్రమబద్ధీకరణసంస్థ (ట్రాయ్), టెలికాం వివాదాలను పరిష్కరించే అప్పిలేట్ ట్రిబ్యునల్ (టీడీఎస్ఏటీ) అధికారాలను దాదాపు పూర్తిగా కత్తెరవేశారు. 1885 ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం స్థానే ఈ బిల్లును రూపొందించారు. పాతచట్టం తొలగించి కొత్తచట్టం అమలు చేస్తారు. విధానాల రూపకల్పన, టెలికాం సర్వీసుల క్రమబద్ధీకరణకు ట్రాయ్‌కి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించారు.

ప్రభుత్వ అధికారాలను విస్తరించడానకి, ఇందుకు ఒక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రధాని మోదీ లక్ష్యం. పోలీసుల అధికారాలను దీనివల్ల చెలాయించవచ్చు. సర్వీసు ప్రొవైడర్లు తప్పనిసరిగా తమ వినియోగదారుల జాబితాను ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉంటుంది. దీనివల్ల ఒక చోట నుండి మరో చోటికి రహస్య మెసేజ్‌లను పంపే సిగ్నల్ లేదా టెలిగ్రామ్ లాంటి యాప్‌లను ఉపయోగించుకోవడం అసాధ్యమవుతుంది. ఇలాంటి అప్లికేషన్లకు ఒటీటీ సర్వీసులను విధిగా ఉపయోగించుకోవాలి. ఇందుకోసం తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవలసి ఉంటుంది. అంతేకాదు ఇంటర్నెట్ ఉపయోగించుకొని కొత్త సర్వీసులను సృష్టించడం చాలా కష్టమవుతుంది. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఇంటర్నెట్‌ను ఉపయోగించుకొని ప్రస్తుతం ఉన్న బడా పెట్టుబడిదారులు, పెద్ద,పెద్ద కంపెనీలు మాత్రమే వాణిజ్య సర్వీసులను అందించడానికి అనుమతి ఉంటుంది. టెలికాం సర్వీసుల క్రమబద్ధీకరణ, విధానాల రూపకల్పన బాధ్యతను ప్రభుత్వ టెలికాంశాఖ(డాట్) నిర్వహిస్తుంది. ఇకపై ప్రభుత్వం అప్పగించే పనులు మాత్రమే ట్రాయ్ చేయాలి. ట్రాయ్ చేయవలసిన పనుల్లో టారిఫ్ నిర్ణయం లాంటి వాటిల్లో డాట్‌కు అనుబంధంగా ఉండి పనిచేయవలసి ఉంటుంది. స్వతంత్ర ప్రతిపత్తిని మోదీ దాదాపు ఎత్తివేసినట్టే అవుతుంది. టెలికమ్యూనికేషన్ల చట్టానికి లోబడి పనిచేయాలి.

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని, దీన్ని నిర్వీర్యం చేయాలంటే చట్టం కావాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పుట్టుస్వామి తీర్పు చెప్పారు. లక్ష్యాలకు వాటిని సాధించే మార్గాలకు మధ్య సహేతుకమైన సంబంధం ఉండాలి. ఐదేళ్లు గడిచినా డాటా రక్షణ చట్టం రూపొందించకపోవడం అత్యంత విచారకరం. చట్టంలో లేకుండా అన్ని అంశాలపై సామూహికంగా నిఘా ఉంచడం సాధ్యంకాదని పుట్టుస్వామి తీర్పు స్పష్టం చేసింది. అసలు సమస్య ఏమంటే, డాటా రక్షణచట్టం లేకపోవడమేనని అందువల్ల పౌరుడు తన హక్కును ఉపయోగించుకోలేడు. తగిన నియంత్రణలు లేకుండా నిఘాను నిర్వహించడానికి దాదాపు పది ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఏజన్సీలు ఉన్నాయి. ఇంటర్నెట్‌ను టెలికాం సర్వీసుగా కమ్యూనికేషన్స్‌ను నిర్వహించడం ద్వారా ప్రభుత్వ అధికారాలు విస్తరించడానికి ముసాయిదా టెలికాం బిల్లు దోహదం చేస్తుంది.

ముసాయిదా టెలికాం బిల్లులో ఓటీపీ సర్వీసులుగా పేర్కొన్నారు. దీని అర్థం ఏమంటే నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్, అమెజాన్ సంస్థలు తమ పొరుగువారికి కూడా వస్తువులను సరఫరాచేసే యాప్‌ను ఉపయోగించుకుంటాయి. వీటినికూడా ఓటీటీ సర్వీసుగా పరిగణిస్తారు. అయితే ఇందుకు రిజిస్ట్రేషన్, లైసెన్సు అవసరమవుతుంది. అయితే ఇలాంటి క్రమబద్ధీకరణ చేసే సర్వీసులు చాలా ఉన్నాయి. ఉదాహరణకు మెడికల్ సర్వీసులను ఆరోగ్యమంత్రిత్వ శాఖ(కేంద్రం,రాష్ట్ర స్థాయిలలో) క్రమబద్ధీకరిస్తుంది. మున్సిపల్ సంస్థలు సైతం వీటిని క్రమబద్ధీకరించవచ్చు. అలాగే విద్య, వాణిజ్యం, తదితర సర్వీసుల క్రమబద్ధీకరణ వాటి స్వభావాన్ని బట్టి ఉంటుంది. అలాంటివాటినన్నింటినీ ఓటీటీ సర్వీసులుగా నిర్ణయించి కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి తీసుకువస్తారు. దీనితో కేంద్ర ప్రభుత్వం, టెలికాం శాఖకు సామూహిక నిఘా అధికారం దఖలుపడుతుంది. ఓటీటీ సర్వీసులు ఆధారంగా అన్ని సర్వీసులను నిర్వహించినట్లయితే అది క్రమబద్ధీకరణకు కేంద్రానికి కాకుండా, ఇంటర్నెట్ సర్వీసులను అందించే సంస్థలుసైతం ఇతర సర్వీసులను అందించే సంస్థలపైన గుత్తాధిపత్యాన్ని పొందుతాయి. ఫలితంగా కొత్త సర్వీసులు ఆవిర్భవించే అవకాశం ఉండదు. టెలికాం సేవలకు ఎవరు మార్గదర్శకులుగా ఉన్నప్పటికీ ప్రపంచంలో అత్యంతవేగంగా విస్తరిస్తున్న ఈ రంగంలో నూతన ఆవిష్కరణల గొంతునొక్కేందుకేనని భావించాలి. ప్రస్తుతం ఇంటర్నెట్‌ను నెట్ తటస్థీకరణ సూత్రాల ఆధారంగా వినియోగిస్తున్నారు.

భారతదేశంలో వినియోగదారులు, క్రమబద్ధీకరణ అధికారసంస్థలు, ఈ సదుపాయాలను రూపొందించారు. ప్రభుత్వానికి అన్ని రంగాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే తిరోగమన విధానాలను ఎందుకు అనుసరిస్తున్నారు? ఎందుకు నిఘా పెడుతున్నారు? ప్రైవేటు టెలికాం గుత్తాధిపతుల సంస్థల పట్ల ఎందుకింత మమకారం? ప్రజలపైన అన్నిరకాల నిఘాలను ఉంచి ఈ దేశాన్ని ఏం చేయదలచుకున్నారు? దీనివలన ఎవరికి ప్రయోజనం కలుగుతుంది? ప్రభుత్వం పూర్తిగా లైసెన్సును, నిఘాపైన తన అధికారాలను విస్తరించుకుంటోంది. కొత్త బిల్లుద్వారా దేశంలోని ప్రధానమైన టెలికాం ఆపరేటర్లు-రిలయన్స్, జియో, ఎయిర్‌టెల్, ఒడాఫోన్, ఐడియా లాంటి వాటికి అపార ప్రయోజనం కలుగుతుంది. దేశంలో ఈ సంస్థలే అత్యంత కీలకమైన ఇంటర్నెట్ సర్వీసులను అందిస్తున్నాయి. వీటికి ఇతర సర్వీసుల నుంచి పోటీ రాకుండా కొత్త బిల్లు సహకరిస్తుంది. వినియోగదారులే అప్రమత్తం కావాలి.

అమలుకాని సిఫార్సులు

ఇ-మెయిల్

ఇటీవల పార్లమెంటరీ స్థాయీ సంఘాలు సమర్పించే రిపోర్టులు అమలు కాకపోవడమూ, అమితజాప్యాల పాలవడం జరుగుతున్నాయి. ఈపీఎఫ్ఓ పింఛనుపై ఏర్పాటుచేసిన పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రస్తుతమున్న రూ.1000 కనీస పింఛను ఏమాత్రం సరిపోదని, ఆ మొత్తాన్ని పెంచాలని సిఫార్సు చేసింది. దీనిని ఆర్థిక మంత్రిత్వశాఖ తిరస్కరించింది. పీఎఫ్ సంస్థలో సమృద్ధిగా నిధులున్నా కనీస పింఛను పెంచకపోవడం పీఎఫ్ పింఛను దార్లకు తీవ్ర అన్యాయమే. అలాగే కేంద్ర పింఛనుదార్లకు 65,70,75 ఏళ్ళకు 5,10,15 శాతం చొప్పున అదనపు పింఛను మంజూరు చేయాలని డిపార్ట్‌మెంటల్ పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సులు, వృద్ధులకు రైళ్ళలో రద్దయిన రాయితీని పునరుద్ధరించాలని మరో కమిటీ చేసిన సిఫార్సులపైనా ఉలుకూపలుకూ లేదు. పార్లమెంటు నియమించే ఈ కమిటీలు చేసిన విలువైన సిఫార్సులను అమలు చేయకపోవడం, తాత్సారం చేయడం కమిటీల నియామకాలకే అర్థంలేకుండా పోతోంది.

పి.వి.ప్రసాద్, 9440176824

వైసిపి, బీజేపీ విన్యాసాలు

వి. శంకరయ్య

ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి బిజెపి పార్టీల విన్యాసాలు చిత్ర విచిత్రంగా వుంటున్నాయి. రాష్ట్ర స్థాయిలో నేను కొట్టినట్లు నటిస్తాను. నువ్వు ఏడ్చినట్లు నటించమని ఒప్పందం చేసుకొని రెండు పార్టీలు పని చేస్తున్నాయి. కేంద్రంలో రాష్ట్రంలో రెండు పార్టీలు అధికారంలో వున్నందున నువ్వులేనిదే నేను లేను! నేను లేనిదే నువ్వు లేవు అని వ్యవహరిస్తున్నాయి. అయితే ఇంత వరకు గుట్టు చప్పుడు లేకుండా సాగుతున్న ఈ బండారం ప్రధాన మంత్రి మోదీ విశాఖ పర్యటనతో బట్ట బయలు అయింది. ఇద్దరిదీ విడదీయ లేని పెవికాల్ బంధం. ప్రధాన మంత్రి మోదీ కరుణా కటాక్షాలు లేకపోతే జగన్మోహన్‌రెడ్డి ఎక్కడ వుండే వారో అందరికీ తెలుసు . అంతేకాదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క పూట గడవడం కూడా కష్టంగా వుండేది. కేంద్ర ఆర్థికమంత్రి రాష్ట్ర పర్యటనకు వస్తే రాష్ట్ర ఆర్థికమంత్రి వెన్నంటి వున్న తీరు ఇది వరలో అరుదు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వానికి అప్పు పరిమితి 43 803 కోట్లు అయితే ఇప్పటికే 62 వేల కోట్లు అప్పు చేశారు. కేంద్రం ఏలా అనుమతించింది? ఇంకా అయిదు నెలల కాలం వుంది. ఎటిఎం అనే పదం ఇది వరకు ఈ రెండు పార్టీలు ఇతరుల విషయంలో వాడిన సందర్భముంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పుల విషయంలో ఎటిఎం నిజమైంది.

అయితే రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టేందుకు ఇతర రాష్ట్రాల నుండి విమర్శలు తట్టుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుండి ఘాటు (ప్రేమ) లేఖలు అడపాదడపా రాష్ట్రానికి వస్తుంటాయి. పక్కనే వున్న తెలంగాణ కేరళ, తమిళనాడు రాష్ట్రాల యెడల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్లు ఒక్కరోజు ఆంధ్రప్రదేశ్ యెడల వ్యవహరిస్తే ఏమౌతుందో అనూహ్యం. ఈ పెవికాల్ బంధం గురించి బిజెపి నేత సోము వీర్రాజు మాట్లాడడు గాని అన్ని రాష్ట్రాలకు నిధులు విడుదల చేసినట్లే ఎపికి ఇస్తే వాటి గురించి యాగీ చేస్తుంటారు. ఇతర పార్టీలు ఏవైనా విమర్శలు చేస్తే అంతెత్తున లేచే వైసిపి నేతలు అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఎపికి ఇస్తున్నారని కౌంటర్ ఇవ్వడం లేదంటే జగన్మోహన్‌రెడ్డి బలహీనతతో పాటు రెండు పార్టీల లాలూచీ కుస్తీ ఇమిడి వుంది.

మరో వేపు వైసిపి సభ్యుల మద్దతు లేనిదే రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం గట్టెక్కడం ఒక్క పూట గడవదు. ఆ మాట కొస్తే జగన్మోహన్ రెడ్డి లాంటి అణకువ గల ముఖ్యమంత్రికి ప్రధాన మంత్రి దొరకడం కష్టం. అందులో దక్షిణాదిలో ఒక్క కర్నాటకలో తప్ప మిగిలిన రాష్ట్రాలు ప్రతి పక్షాల అధీనంలో వున్నాయి. ప్రధాన మంత్రి ఏ ఇతర రాష్ట్రాలకు వెళ్లినా అధికార ప్రొటోకోల్ యంత్రాంగం తప్ప ఆయా రాష్ట్రాల్లో అధికారంలో వుండే పార్టీ జన సమీకరణ (బీజేపీకి ఏలాగూ బేస్ లేదు) చేసే

అవకాశం లేదు. కాని నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతుందో చూస్తే వైసిపి నేత ఎవరో చెప్పినట్లు నిజంగానే మోదీకి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దత్త పుత్రుడే. ఇది వరలో భీమవరం సభకు జన సమీకరణ చేయలేక బీజేపీ చతికిల పడినందున పియంవో ఆఫీసు నుండి ఆదేశాలు వున్నా లేకున్నా ఎన్నికలు ముంచుకొస్తున్న కీలక సమయంలో పరస్పర ప్రయోజనాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అందివచ్చిన అవకాశంగా మిగిలింది. ప్రధానిని ప్రసన్నం చేసుకొనేందుకు సిబిఐ కేసులు మరింత సాగలాగేందుకు మరిన్ని అప్పులు పుట్టించుకొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖలో సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. పైగా విశాఖ రాజధాని చేసేందుకు తను తీసుకున్న నిర్ణయాన్ని ఉత్తరాంధ్ర ప్రజలే కాకుండా రాష్ట్ర ప్రజల ఆమోదం వుందని ప్రధాని దృష్టిలో పడేందుకు కృషి చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు వైసిపితో లాలూచీ కుస్తీ పడిన రాష్ట్ర కమలనాథులు నేడు కుడితిలో పడ్డ ఎలుకల్లా గిలగిల తన్నుకుంటున్నారు. అదే సమయంలో బిజెపికి కూడా ఎపిలో ప్రజాబలం వుందని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించడానికి సిద్ధపడుతున్నారు.

వాస్తవంగా ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోనికి వచ్చే అవకాశాలు లేవు. కారణాలు పక్కన పెడితే ఇంతకాలం బీజేపీ తన మిత్ర పక్షమని చెబుతూ వచ్చిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఇటీవల కాలు జాడించారు.! బీజేపీతో నిమిత్తం లేకుండా తన పని తాను చేసుకు పోతున్నారు. కేంద్రానికి గులాంగిరి చేయదలుచుకోలేదని జగన్మోహన్‌రెడ్డిని అధికారం నుండి దింపడమే తన ధ్యేయమని చెప్పేశారు. ఆ మాట కొస్తే ఇంతవరకు జనసేన బీజేపీ కలిసి ప్రసంగించిన ఒక్క సభ లేదు. కాని కమలనాథులు మాత్రం తమ మిత్ర పార్టీ జనసేన అని చెబుతూ విశాఖ సభకు జనసేన అధినేత హాజరు గురించి సోము వీర్రాజు మౌనం పాటించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీజేపీ జాతీయ నాయకత్వం తనతో వుందని చెప్పేందుకు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. కాని త్వరలోనే ఇది బెడిసికొట్టే అవకాశం ఉంది.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తంటాలు పడి జన సమీకరణ చేసి ప్రధాన మంత్రి మోదీకి హారతులు పట్టి సన్మానాలు చేసి మెప్పు పొందవచ్చు. కాని వాస్తవంలో గుర్రపు డెక్క దెబ్బ తప్పదు. ఎందుకంటే తనకు 25 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించి ఇస్తే ప్రత్యేక హోదా తీసుకువస్తానని చెప్పి అధికారం చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా గాలికి వదిలేశారు. తుదకు చట్టబద్ధత గల పోలవరం ప్రాజెక్టుకు నిధులు రాబట్ట లేకపోయారు. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో తెలియదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ప్రకటన చేశారు. మోదీకి హారతులు పట్టి ఏం సాధించారని అడిగి రాష్ట్ర ప్రజలకు ఏమని సమాధానం చెబుతారు? పైగా పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకపోతే రాజధానిని చేయబోయే విశాఖకు శాశ్వత తాగునీటి వసతి ఏర్పడదు. పైగా ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో 30 లక్షల మందికి తాగునీటి వసతి ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి హుష్ కాకి అవుతుంది. ఇవన్నీ అటుంచి దాదాపు 40 బలిదానాలతో ప్రభుత్వ రంగంలో నిర్మించిన విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటు పరం కాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రధానమంత్రి మోదీ నుండి హామీ పొందకపోతే పడిన శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అవబోతోంది. అంతేకాదు ఉత్తరాంధ్ర ప్రజలకు విశాఖ ఉక్కు కర్మాగారం గురించి ఏమని చెబుతారు? కేవలం తన సిబిఐ కేసులు మాఫీ కోసం అప్పుల కోసం మాత్రమే మోదీకి హారతులు పెట్టారని రాష్ట్ర ప్రజలు భావించే అవకాశం ఉంది. ప్రధాన మంత్రి చరిష్మా తగ్గలేదని దేశ ప్రజలకు చెప్పడానికే విశాఖ పర్యటన ఉపయోగించుకోనున్నారు. అంతేకాదు. ఆంధ్ర ప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడమే బిజెపి జాతీయ నాయకత్వం అభిలాష. ఈ వాస్తవాలు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎంత త్వరగా గ్రహించితే రాష్ట్ర ప్రజలకు అంత క్షేమం.

వ్యాస రచయిత విశ్రాంత పాత్రికేయులు, 9848394013

గుజరాత్ పీఠంపై ఆప్ గురి!

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్) ఉవ్విళ్లూరుతోంది. ఆ మేరకు తీవ్రంగా శ్రమిస్తోంది. రాష్ట్రంలో అధికారమే ధ్యేయంగా పావులు కదుపుతోంది. ముందుగా పాలక బీజేపీకి తానే ప్రధాన ప్రత్యర్థి అనిపించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. వాస్తవంగా 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసినప్పటికీ కనీస గుర్తింపు పొందలేకపోయింది. ఓట్లు రాలేదు...సీట్లు రాలేదు. గత ఎన్నికల్లో 29 సీట్లలో అభ్యర్థులను రంగంలోకి దించిన ఆప్...అన్నిస్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ దిల్లీ, పంజాబ్‌లో అనుసరించిన విధానాన్నే ఆప్ ముందుకు తీసుకెళుతోంది. ప్రధానంగా అందరికీ ఉచిత విద్య, వైద్యం, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను ప్రచారం చేస్తోంది. తమకు అధికారం ఇస్తే ఆ రెండు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఈ మూడు హామీలను కచ్చితంగా పూర్తి చేస్తామని ఓటర్లను నమ్మించే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టడానికి శతవిధాలా కృషి చేస్తోంది. గుజరాత్ ఓటర్లను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ఆప్ అధినేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే అనేకసార్లు రాష్ట్రంలో పర్యటించారు. హామీల వర్షం కురిపిస్తున్నారు. తమ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా మాజీ జర్నలిస్టు ఇసుదాన్ గఢ్వీ పేరును అధికారికంగా ప్రకటించారు. 2017 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2014లో 26లోక్‌సభ స్థానాలకుగాను 24 చోట్ల ఆప్ అభ్యర్థులను బరిలో దించింది. వారంతా దారుణ ఓటమి చవిచూశారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు మాత్రం ఆప్ దూరంగా ఉంది. 2014 లోక్‌సభ, 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థులంతా ఘోర ఓటమి ఎదుర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన సమాచారం మేరకు ఆప్ అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. తాజా ఎన్నికల్లో బీజేపీకి తామే ప్రధాన ప్రత్యర్థి అని నిరూపించుకోవడానికి తంటాలు పడుతోంది. మొత్తం 182 అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తోంది.

గుజరాత్‌లో తమ పార్టీ విజయం సాధిస్తుందని కేజ్రీవాల్ ధీమాగా చెబుతున్నారు. 27 ఏళ్ల బీజేపీ దుష్టపాలన పట్ల గుజరాత్ ప్రజలు విసిగిపోయారని అంటున్నారు. 2017లో తాము గుజరాత్‌కు చాలా కొత్తని, తమకు ఓటేస్తే జరిగే ప్రయోజనాల గురించి రాష్ట్ర ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించలేకపోయామని, ఎప్పుడైనా...ఎక్కడైనా ప్రజలకు చేరువ కావడం చాలా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొన్నారు. నాడు ప్రచారం కూడా సమర్థవంతంగా చేయలేకపోయామని ఆయన పీటీఐకి చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము చేయగలిగిన అన్ని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని, ఇంకా పూర్తిస్థాయిలో వివరిస్తామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 29 సీట్లలో పోటీ చేస్తే సూరత్ జిల్లా కతర్గాం నియోజకవర్గ అభ్యర్థి నగ్జిభాయ్ అంబాలియా ఒక్కరే నోటా కంటే ఎక్కువ ఓట్లు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఆ 29 సీట్లలో ఇప్పుడు నలుగురిని మాత్రమే పాత అభ్యర్థులను పోటీలో దింపామన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇప్పటి వరకు 158 మంది అభ్యర్థులను ఆప్ ప్రకటించింది. 'గుజరాత్‌కు ఆప్ కొత్త పార్టీయేమీ కాదు. 2014 నుంచి రాష్ట్రంలో ఆప్ పనిచేస్తోంది. మొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసింది' అని రాజకీయ

- బీజేపీ ప్రత్యర్థి మేమే అంటున్న కేజ్రీవాల్
- గెలిచి తీరుతామంటూ ధీమా
- ఉచిత హామీలపై ఆశలు
- ప్రజలకు చేరువయ్యేందుకు కృషి

వ్యాఖ్యాత నిశాంత్ వర్మ పీటీఐకి చెప్పారు. అప్పటి నుంచి 2017 అసెంబ్లీ ఎన్నికలు, 2021 స్థానిక ఎన్నికలు సహా అనేక ఎన్నికల్లో ఆప్ పోటీ చేసిందని ఆయన పేర్కొన్నారు. గతేడాది జరిగిన సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ 27 మంది అభ్యర్థులను గెలిపించుకున్నది. గతంలో ఆప్ పనితీరును పరిశీలిస్తే మాజీ ముఖ్యమంత్రులు శంకర్‌సిన్హ వాఘేలా, కేశూభాయ్ పటేల్ సహకారంతో ఏర్పడిన స్థానిక పార్టీలకు సమీప దూరంలో కూడా లేదని వర్మ గుర్తుచేశారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి కేజ్రీవాల్ రాష్ట్రంలో భారీ ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం, కొత్తగా పట్టాలు తీసుకున్న న్యాయవాదులకు నెలవారీ స్టైఫండ్ వంటి హామీలను కేజ్రీవాల్ గుప్పిస్తున్నారు. కేజ్రీవాల్‌తో పాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్, దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా తదితరులు ప్రచారాన్ని తమ భుజస్కంధాలపై వేసుకున్నారు.

మెయిన్‌పురి నుంచి డింపుల్ యాదవ్ పోటీ

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ గురువారం మెయిన్‌పురీ పార్లమెంటరీ అభ్యర్థిని ప్రకటించింది. ములయాం సింగ్ యాదవ్ మృతితో ఖాళీ అయిన ఈ స్థానంలో డింపుల్ యాదవ్ పోటీ చేస్తున్నట్టు తెలిపింది. డిసెంబర్ 5న ఇక్కడ ఉప ఎన్నికల జరగనున్నది. 'మెయిన్‌పురం ఉప ఎన్నికల్లో పార్టీ డింపుల్ యాదవ్‌ను అభ్యర్థినిగా ప్రకటించింది' అని సమాజ్‌వాదీ పార్టీ ట్విట్టర్‌లో పేర్కొంది. 2012 నుంచి 2014 వరకూ డింపుల్ గతంలో కన్నూజ్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆమె సమావాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య. అయితే మొదట మెయిన్‌పురం స్థానం నుంచి ములయాం సింగ్ యాదవ్ మనవడు తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేస్తాడని రాజకీయ వర్గాల్లో పుకార్లు షికార్లు చేశాయి. ఎట్టకేలకు ఈ స్థానం చివర్లో డింపుల్ యాదవ్‌ను వరించింది. ఈ స్థానంలో 1996 నుంచి సమాజ్‌వాదీ పార్టీకి పట్టు ఉంది. డిపుంల్ మామ అయిన ములయాంను మెయిన్‌పురి ప్రజలు బ్రహ్మాండంగా ఆదరించారు. ప్రస్తుతం ఆయన వారసత్వాన్ని కాపాడుకుంటూ, ఆ స్థానాన్ని గెలుచుకోవాల్సి బాధ్యత డింపుల్‌పై పడింది. మెయిన్‌పురి లోక్‌సభ నియోజకవర్గంలో అఖిలేశ్‌కు చెందిన కర్హాల్ అసెంబ్లీ స్థానం ఒకటి. అయితే ఈ స్థానంలో డింపుల్ ఎంపికతో, బీజేపీకి గట్టి సవాల్ విసిరినట్టయింది. దీనిపై శివపాల్ యాదవ్‌కు చెందిన ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ (లోహియా) ఇప్పటి వరకూ స్పందించలేదు.

ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆర్డినెన్స్‌పై 16కు విచారణ వాయిదా

చెన్నై: ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌ను నిషేధిస్తూ తమిళనాడు ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆర్డినెన్స్‌ను మద్రాసు హైకోర్టులో సవాలు చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి రాజా, జస్టిస్ డి భరత చక్రవర్తిలతో కూడిన మొదటి ధర్మాసనం, ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్ విచారణను నవంబర్ 16కి వాయిదా వేసింది. ఆన్‌లైన్ గేమ్‌లు, జూద కారణంగా కుటుంబాలు ధ్వంసమయ్యాయని, అనేక ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయని, గేమింగ్ వ్యసనం ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేసిందని అందుకే ఆర్డినెన్స్ తీసుకురానున్నట్టు తమిళనాడు ప్రభుత్వం అప్పట్లో పేర్కొంది. గత నెలలో రాష్ట్రంలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌ను నిషేధించడానికి, గేమ్‌లను నియంత్రించడానికి ఆర్డినెన్స్‌ను ప్రకటించింది. అనంతరం ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. అయితే ప్రస్తుతం ఈ ఆర్డినెన్స్‌తో ప్రభుత్వం తమపై బలవంతం చేస్తోందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. దీనిపై విచారణను కోర్టు 16కి వాయిదా వేసింది.

లాలూ ప్రసాద్‌కు కుమార్తె కిడ్నీ దానం

న్యూదిల్లీ: రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు సింగపూర్‌లో ఉంటున్న ఆయన కుమార్తె కిడ్నీ దానం చేసినట్టు లాలూ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తులు గురువారం తెలిపారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లాలూ ప్రసాద్ యాదవ్ గతనెలలో సింగపూర్‌లో వైద్యం చేయించుకున్నారు. అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయనను తక్షణమే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించారు. లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య సింగపూర్‌లోనే నివాసం ఉంటున్నారు. విషయం తెలుసుకున్న ఆమె తన తండ్రికి కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం లాలూ బెయిల్‌పై దిల్లీలో ఉంటున్నారు. దాణా కేసులో ఆయన ప్రమేయం ఉండటంతో గతంలో జైల్లో ఉన్నారు. అనేకసార్లు ఆస్పత్రిపాలవడంతో చికిత్స కోసం దిల్లీ, రాంచీ ఆస్పత్రుల్లో చేరారు. అయితే కిడ్నీ శస్త్ర చికిత్స ఎప్పుడు, ఎలా, ఎక్కడ జరిగిందో స్పష్టత లేదు. దీనిపై ఎయిమ్స్ డాక్టర్లను ప్రశ్నించగా, ప్రస్తుత పరిణామాలపై తమవద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు. మరో దేశంలో కనుక కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స జరిగి ఉంటే, ఎయిమ్స్ నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు అవసరం లేదని ఇంకో వైద్యుడు తెలిపారు.

మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజీనామా

అహ్మదాబాద్: ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. గుజరాత్‌లోని దాహోద్ జిల్లా ఝలోద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే భవేష్ కటారా రాబోయే తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. మోహన్‌సింగ్ రథ్వా, భగవాన్ బరాద్ తర్వాత గత రెండు రోజుల్లో రాజీనామా చేసిన మూడో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈయన. కటారా బుధవారం రాత్రి అసెంబ్లీ స్పీకర్ నిమాబెన్ ఆచార్య నివాసానికి వెళ్లి ఆమెకు తన రాజీనామాను సమర్పించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ఖరారు చేస్తున్న తరుణంలో ఆయన రాజీనామా చేయడం గమనార్హం. కటారా బీజేపీలో చేరతారని తెలిసింది. అంతకుముందు, రథ్వా, బరాద్ కూడా కాంగ్రెస్ పార్టీకి, శాసనసభ్యత్వాలకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. డిసెంబర్ 1, డిసెంబర్ 5న రెండు దశల్లో గుజరాత్ ఎన్నికలు జరగనుండగా, డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

కాలుష్య నిరోధక మార్గదర్శకాలు ఉల్లంఘించినవారిపై జరిమానా

నోయిడా: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, గ్రేటర్ నోయిడాలో గ్రేడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు ఇద్దరు రియల్ ఎస్టేట్ డెవలపర్‌లతో సహా మరికొంతమందిపై రూ.9 లక్షలకు పైగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు నోయిడా అథారిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. కాలుష్య నిరోధక నిబంధనలను ఉల్లంఘించి, నిర్మాణ సామగ్రిని బహిరంగంగా ఉంచిన 11 కేసులలో వారికి జరిమానాలు విధించినట్లు తెలిపింది. ఈ నేరస్థులకు మొత్తం రూ. 3.80 లక్షల జరిమానా విధించినట్లు నోయిడా అథారిటీ వివరించింది. అలాగే గ్రేటర్ నోయిడాలో కాలుష్యాన్ని అరికట్టడానికి చేపట్టాల్సిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఇద్దరు రియల్ ఎస్టేట్ డెవలపర్‌లకు జరిమానా విధించినట్లు తెలిపింది. 'సెక్టార్ 27లోని తన ప్రాజెక్ట్‌లో నిబంధనలను ఉల్లంఘించినందుకు రియల్ ఎస్టేట్ డెవలపర్ హెమిస్ఫియర్‌పై రూ. 5 లక్షలు, నిర్మాణ సామగ్రిని ప్రాజెక్ట్‌లో బహిరంగంగా ఉంచిన యమునా బిల్డ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 50,000 జరిమానా విధించినట్లు పేర్కొంది. నోయిడా, గ్రేటర్ నోయిడా రెండింటిలోనూ గత కొన్ని రోజులుగా గాలి నాణ్యత తీవ్రస్థాయిలో పడిపోయింది. కాలుష్యం పెరుగుదల మధ్య జంట పట్టణాలను దట్టమైన పొగమంచు కప్పేసింది.

రెండేళ్లలో రూ.55 వేల కోట్ల జీఎస్టీ ఎగవేత



న్యూదిల్లీ: జీఎస్టీ అమలును ప్రభుత్వం కట్టుదిట్టం చేస్తోంది. పన్ను ఎగవేత సంస్థలపై అధికారులు కొద్ది రోజులుగా దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ప్రత్యేక డ్రైవ్ లు చేపట్టి మోసాలను నివారించే ప్రయత్నం చేస్తున్నారు. గత రెండేళ్లలో రూ.55,575 కోట్ల విలువ చేసే జీఎస్టీ మోసాలు బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. జీఎస్టీ మోసాలకు పాల్పడిన 700 మందిని అరెస్ట్ చేసి, 22,300 నకిలీ జీఎస్టీ ఐడీ నెంబర్లను గుర్తించారు. అయితే గుర్తించిన మోసాలలో ఎంతవరకు వసూలు చేశారన్నది మాత్రం వెల్లడించలేదు. డీజీజీఐ, డీఆర్ఐ, ఐటీ,ఈడీ,సీబీఐ మధ్య సమన్వయంతోనే నిందితులను గుర్తించ గలిగామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ తనిఖీ, ఇ-వే బిల్లులు, జీఎస్టీ రిటర్నుల ధ్రువీకరణ, ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయింపై ఆంక్షలు వంటి చర్యలతో పన్ను ఎగవేతలను అరికడుతున్నట్లు వెల్లడించారు.

రూ.4050 కోట్ల పెండింగ్ నిధులు ఇవ్వండి

కేంద్రానికి బీహార్ ప్రభుత్వం విజ్ఞప్తి

పాట్నా: కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తంటాలు పడుతున్నాయి. ప్రత్యేకించి బీజేపీ యేతర పాలిత రాష్ట్రాలకు సకాలంలో నిధులు విడుదల చేయడంలో మోదీ సర్కారు పూర్తి వివక్ష, నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. తాజాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద రావాల్సిన రూ.1045 కోట్లు, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన(గ్రామీణ) కింద రూ.3007 కోట్లను తక్షణమే విడుదల చేయాల్సిందిగా బీహార్ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం ప్రాథమిక హక్కని బీహార్ గ్రామీణాభివృద్ధిశాఖమంత్రి శ్రావణ్‌కుమార్ మోదీ సర్కారుకు గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.1045 కోట్లు విడుదల చేకయపోవడంతో మూడు మాసాలుగా కూలీలకు వేతనాలు చెల్లించలేకపోతున్నామని ఆయన వివరించారు. పీఎంఏవై కింద ఇవ్వాల్సిన రూ.3007 కోట్లు విడుదల చేయడంలో జాప్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో గృహనిర్మాణాలు చేపట్టడం ఇబ్బందిగా మారిందని మంత్రి కుమార్ గురువారం పీటీఐకి చెప్పారు. పీఎంఏవై పథకాన్ని అంతరాయం లేకుండా అమలు చేయడానికిగాను సత్వరమే నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని పదేపదే కోరుతున్నామని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు అనేకసార్లు లేఖలు రాశామన్నారు. ఉపాధి పథకం కింద 2020-21 నుంచి పెండింగ్‌లో గల కేంద్రం వాటా రూ.1823.92 కోట్లకుగాను కేంద్రం ఇప్పటి వరకు రూ.791.42 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగిలిన రూ.1045 కోట్లను తక్షణమే ఇవ్వాలని పదేపదే కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని చెప్పారు.

కొయంబత్తూరు కారు పేలుళ్ల కేసు

తమిళనాడులో ఎన్ఐఏ సోదాలు

కొయంబత్తూరు(తమిళనాడు): ఎన్ఐఏ విచారిస్తున్న కొయంబత్తూరులోని దేవాలయం ఎదుట పేలిన కారు బాంబు కేసుకు సంబంధించి తమిళనాడులోని ఎనిమిది జిల్లాల్లో, 40 ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్టు గురువారం అధికారులు తెలిపారు. ఎన్ఐఏ అధికారి ప్రతినిధి దీనిపై మాట్లాడుతూ తమిళనాడులోని చెన్నై, కొయంబత్తూరు, తిరువల్లూరు, తిరుప్పూర్, నీలగిరీస్, చెంగల్‌పట్టు, కాంచీపురం, నాగపట్టణంతో సహా పొరుగున ఉన్న కేరళకు చెందిన పాలక్కాడ్ జిల్లాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబరు 23న కొట్టి ఈశ్వరన్ దేవాలయం ఎదుట నిలిపి ఉంచిన కారు పేలిన విషయం తెలిసిందే. ఎన్ఐఏ ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, నిందితుడు, జమేషా ముబీన్, ఐసిస్ ఉగ్రవాద సంస్థకు విధేయతతో, ఆత్మాహుతి దాడిని నిర్వహించి, దేవాలయ స్మారక చిహ్నాలను విస్తృతంగా దెబ్బతీయాలని, హిందువులను భయాందోళనకు గురిచేయాలనే ఉద్దేశ్యంతో పథకం పన్నినట్టు తెలిపింది. దీనిపైపాథమికంగా కొయంబత్తూరులోని ఉక్కడం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, అనంతరం కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు అక్టోబరు 28న ఎన్ఐఏ తిరిగి కేసును నమోదు చేసింది. గురువారం నిర్వహించిన సోదాల్లో నిందితుల ఇళ్లలో డిజిటల్ పరికరాలు, నేరారోపణ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు చనిపోయిన జమేషా ముబీన్‌తో కలిసి సంచలనాత్మక ఉగ్రవాద చర్యలకు పాల్పడేందుకు ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి వాహనం ద్వారా ఐఈడీతో సహా పేలుడు పరికరాల తయారీకి వివిధ రసాయనాలు, ఇతర పదార్థాలను సేకరించినట్టు ఎన్ఐఏ వివరించింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని అధికార ప్రతినిధి వివరించారు.

ఫరీద్‌కోట్‌లో కాల్పులు...'డేరా' అనుచరుడి మృతి

చండీగఢ్: పంజాబ్ రాష్ట్రం ఫరీద్‌కోట్‌లో గురువారం ఉదయం కాల్పులు జరిగాయి. బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు డేరా సచ్చాసౌదా అనుచరుడు ప్రదీప్ సింగ్ ను కాల్చి చంపారు. ప్రదీప్ సింగ్ గురువారం ఉదయం తన దుకాణానికి వెళుతుండగా దాడి జరిగింది. ఈ కాల్పుల్లో మరో ముగ్గురు వ్యక్తులు కూడా గాయపడ్డారు. ప్రదీప్ సింగ్... బర్గారీ హత్య కేసులో నిందితుడని పంజాబ్ పోలీసులు తెలిపారు. 'ఈ రోజు జరిగిన కాల్పుల్లో ప్రదీప్ సింగ్ అనే వ్యక్తి మరణించగా, ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. అతని భద్రతా సిబ్బంది కూడా ఆగంతకులపై ప్రతీకార కాల్పులు జరిపారు.

మేం ఘటన జరిగిన స్థలంలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నాం,పరిస్థితి అదుపులో ఉంది' అని ఫరీద్‌కోట్ రేంజ్ ఐజీ ప్రదీప్ కుమార్ యాదవ్ మీడియా ప్రతినిధులకు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ఎవరు ప్రయత్నించినా కఠిన చర్యలుంటాయని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ స్పష్టం చేశారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని సీఎం కోరారు. 'పంజాబ్ శాంతిని ప్రేమించే రాష్ట్రం, ఇక్కడ ప్రజల పరస్పరం సోదరభావంతో మెలుగుతుంటారు.

శాంతికి విఘాతం కలిగించడానికి ఎవరినీ అనుమతించం. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సివిల్, పోలీసు అధికారులకు కఠినమైన సూచనలు చేశాం' అని మాన్ ట్వీట్ చేశారు.

160 మందితో బీజేపీ జాబితా

ఐదుగురు మంత్రులు సహా 38 మందికి టికెట్ల నిరాకరణ

న్యూదిల్లీ/అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ 160 మందితో మొదటి జాబితాను గురువారం విడుదల చేసింది. అందులో ఐదుగురు మంత్రులు సహా మొత్తం 38 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించింది. మోర్బీ ఎమ్మెల్యే, కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి బ్రిజేశ్ మెర్జాకు టికెట్ దక్కలేదు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు తన సొంత నియోజకవర్గం ఘట్లోడియాను కేటాయించింది. మొదటి దశ డిసెంబరు 1న జరిగే పోలింగ్‌కు సంబంధించి 89 సీట్లకుగాను 84మందిని బీజేపీ ఖరారు చేసింది. రెండోదశకు సంబంధించి 93 మందికిగాను 76 మంది పేర్లు ప్రకటించింది. కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, మన్సుఖ్ మాండవీయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్ దిల్లీలో విలేకరుల సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. ఈ జాబితాలో 69 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించినట్లు యాదవ్ తెలిపారు. ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు సీట్లు ఇవ్వలేదని చెప్పారు. జాబితాలో 14 మంది మహిళలు, 13 మంది ఎస్సీలు, 24 మంది ఎస్టీలకు చోటు కల్పించామన్నారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, మాజీ డిప్యూటీ సీఎం నితిన్ పటేల్ సహా సీనియర్ నేతలను పక్కనపెట్టినట్లు

వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమై అభ్యర్థుల జాబితాను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. 2012, 2017ల కచ్ జిల్లా భుజ్ నియోజకవర్గం నుంచి గెలిచిన గుజరాత్ అసెంబ్లీ స్పీకర్ నిమాబెన్ ఆచార్యకు టికెట్ లభించలేదు. కేబినెట్ మంత్రులు రాజేంద్ర త్రివేది, ప్రదీప్ పర్మార్, బ్రిజేశ్ మెర్జా, అరవింద్‌రాయ్ యాని, ఆర్‌సీ మక్వానాకు మొదటిజాబితాలో టికెట్లు లభించలేదు. కొద్దినెలల క్రితం కీలక రెవెన్యూశాఖ నుంచి కూడా త్రివేదీని తప్పించారు. మాజీ సీఎం విజయ్ రూపానీ, 2012-21 మధ్యకాలంలో మంత్రులుగా పనిచేసిన ఏడుగురు ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వలేదు.

భద్రతా బెదిరింపుల్లో కొత్త కోణాలు: రాజ్‌నాథ్

న్యూదిల్లీ: అంతర్గత, బాహ్య భద్రత మధ్య అంతరం తగ్గుతోంది... భద్రతా బెదిరింపుల్లో కొత్త కోణాలు పుట్టుకొస్తున్నాయి... వాటిని వర్గీకరించడం చాలా కష్టంగా మారిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ... చలనశీలత లేని, స్పర్శ రహిత యుద్ధ ధోరణిపై ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్-దాడులకు కీలక మౌలిక సదుపాయాల దుర్బలత్వం పెద్ద ఆందోళనగా మారిందన్నారు. రవాణా, ప్రభుత్వ రంగ సేవలు, టెలికమ్యూనికేషన్లు, క్లిష్టమైన తయారీ పరిశ్రమలతో పాటు ఇంధన రంగం సైబర్ దాడుల ప్రధాన లక్ష్యాలలో ఒకటి అని సింగ్ పేర్కొన్నారు. 'మారుతున్న కాలం,

సమాజంతో పాటు భద్రత యొక్క కొలతలు కూడా మారాయి. అంతర్గత, బాహ్య భద్రత మధ్య అంతరం తగ్గుతోంది. భద్రతా బెదిరింపుల్లో కొత్త కోణాలు ఉద్భవించాయి. వాటిని వర్గీకరించడం చాలా కష్టంగా మారుతోంది' అని సింగ్ అన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ వార్తల వ్యాప్తిపై మాట్లాడుతూ... ఇవి సమాజంలో ఏ మేరకు ద్వేషపూరిత విషయాలను తీసుకువచ్చే అవకాశం ఉందో పరిమితి లేదని రాజ్‌నాథ్ అన్నారు. 'సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ వేదికల వ్యవస్థీకృత ఉపయోగం ప్రజల అభిప్రాయం లేదా దృక్పథాన్ని ప్రభావితం చేయడానికి ఉపయోగించబడుతోంది. రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న సంఘర్షణలో సమాచార యుద్ధం విస్తరణ చాలా స్పష్టంగా కనిపించింది' అని ఆయన పేర్కొన్నారు. నాగరిక దేశాల సమష్టి భాగస్వామ్యం, బాధ్యతతో పని చేయడం ద్వారా భద్రతా సవాళ్ల సమస్యను పరిష్కరించవచ్చని సింగ్ అన్నారు. సమాచార యుద్ధం మన రాజకీయ సుస్థిరతకు ముప్పు తెచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమాల్లో ప్రచార దూకుడు

హిమాచల్‌లో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ముంగిట ప్రధాన పక్షాలైన కాంగ్రెస్, బీజేపీ...ప్రత్యర్థిని ఇరకాటంలో పెట్టి లబ్ది పొందే ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడంలేదు. సామాజిక మాధ్యమాల ద్వారా పరస్పరం విమర్శల దూకుడు పెంచాయి. 'నయా రివాజ్ బనాయేంగే, ఫిర్ భాజ్పా లాయేంగే' (కొత్త సంప్రదాయం తీసుకొస్తాం... మళ్లీ బీజేపీని అధికారంలోకి తీసుకువస్తాం) అనే ట్యాగ్‌లైన్‌తో మంగళవారం సాయంత్రం నుంచి ప్రచారాన్ని ప్రారంభించినట్లు బీజేపీ నేత సంజయ్ టాండన్ పీటీఐకి తెలిపారు. ఇదిగాక బీజేపీ... 15 సెకన్ల నిడివి గల వీడియో సందేశాలను సిద్ధం చేసింది. వాటిలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలెక్కుపెట్టింది. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో భారీ వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చలేదంటూ బీజేపీ లక్ష్యంగా కాంగ్రెస్ సైతం విమర్శలకు దిగింది. 'వారు హిమాచల్ ప్రత్యేక హోదాను లాక్కున్నారు... మేము దానిని గౌరవప్రదంగా తిరిగి ఇచ్చాము' అని బీజేపీ ఓ వీడియో సందేశాన్ని ప్రచారం చేస్తోంది. మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పారిశ్రామిక ప్యాకేజీ ఇచ్చిందని, ఆ రెండింటినీ రద్దు చేసింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ తుక్డే తుక్డే ముఠాను నడుపుతుండగా కాషాయ పార్టీ దేశంలో ఐక్యతను బలపరుస్తోందని చెబుతున్నారు. కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు జరిగాయని, తాము నిజాయితీ, పారదర్శక పాలన అందించామంటూ అధికార బీజేపీ మరో వీడియో క్లిప్పింగ్‌ను వ్యాప్తి చేస్తోంది. కాగా బీజేపీ పాలనలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని, అవినీతి తాండవిస్తోందని ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శించింది. 'రోడ్లు కాలువలుగా మారాయి. నడవడం కష్టంగా మారింది' అని, 'కాంగ్రెస్ అంటే అభివృద్ధి, విశ్వసనీయతకు మారు పేరు' అని వీడియో సందేశాలను విడుదల చేసింది. రెండు పార్టీలూ తమ మేనిఫెస్టోల్లో ప్రజలకు చేసిన వాగ్దానాలను ప్రచారం చేసేందుకు సామాజిక మాధ్యమాలు వేదికగా దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో నవంబరు 12న ఒకే దశలో పోలింగ్ జరగనుండగా, డిసెంబరు 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

68 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 'విజయ ఆశీర్వాద్' ర్యాలీ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారానికి గురువారంతో గడువు ముగిసింది. ఈలోపే కాంగ్రెస్ పార్టీ 68 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'విజయ ఆశీర్వాద్' ర్యాలీలు చేపట్టినట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సిర్‌మౌర్‌లో జరిగిన బహిరంగ సభలో పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రతి నియోజకవర్గానికి చెందిన అభ్యర్థి స్థానిక దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానికుల నుంచి ఆశీర్వాదం పొందారు. సిర్‌మౌర్ జిల్లా షిల్లాయ్‌లోని శతౌన్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ప్రియాంక గాంధీ వాద్రా ప్రచారం నిర్వహించారు. మాల్ రోడ్ నుంచి లక్కర్ బజార్ వరకూ ఆమె 'జన్ సంపర్క్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నవంబర్ 12న జరిగే ఎన్నికల్లో ఎలాగైనా బీజేపీపై గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ చూస్తోంది.

పెరిగిన ఎల్‌వీఎం3 పేలోడ్ సామర్థ్యం: ఇస్రో

బెంగళూరు: భారత్‌లోని అత్యంత బరువైన రాకెట్ ఎల్‌వీఎం 3 పేలోడ్ సామర్థ్యం మరో 450కేజీలకు పెరిగింది. ఇంజిన్ పరీక్ష విజయవంతం కావడం ఇందుకు దోహదమైందని భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) తెలిపింది. 'సీఈ20 క్రియోజెనిక్ ఇంజిన్‌ను ఎల్‌వీఎం3 (లాంచ్ వెహికల్ మార్క్ 3) కోసం దేశీయంగా తయారు చేశారు. బుధవారం మొదటిసారిగా 21.8 టన్నుల అప్‌రేటెడ్ థ్రస్ట్ లెవల్‌లో విజయవంతంగా హాట్‌టెస్ట్ నిర్వహించారు. దీంతో ఎల్‌వీఎం 3 పేలోడ్ సామర్థ్యం 450 కేజీలకు పెరిగింది' అని ఇస్రో గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. పాత ఇంజిన్‌లకు కొత్త ఇంజిన్‌కు ఉన్న ప్రధాన మార్పు థ్రస్ట్ కంట్రోల్ వాల్వ్ (టీసీవీ)ని థ్రస్ట్ కంట్రోల్ కోసం ప్రవేశపెట్టడమేనని ఇస్రో వెల్లడించింది. అంతేకాకుండా 3డీ ప్రింటింగ్ ఎల్‌ఓఎక్స్, ఎల్‌హెచ్ 2 టర్బైన్ ఎగ్జాస్ట్ కేసింగ్‌లను మొదటిసారి ప్రవేశపెట్టినట్లు పేర్కొంది. పరీక్షా సమయంలో ఇంజిన్ 20 టన్నుల థ్రస్ట్ స్థాయిని తొలి 40 సెకన్లు తట్టుకున్నదని, ఆ తర్వాత స్థాయిని 21.8 టన్నులకు పెంచగా బాగానే పనిచేసిందని, ఇంజిన్ పనితీరు తదితర అవసరమైన పారామీటర్లు (కొలతలు) కావాల్సిన విధంగా నమోదు అయినట్లు ఇస్రో ప్రకటన తెలిపింది.

మోదీ పర్యటనను నిరసిద్దాం

- రాష్ట్రపతి, గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనమేమిటి?
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలకు పునర్వి భజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు నిరసనగా బంద్ పాటించాలని, నల్లజెండాలతో నిరసన తెలపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ మగ్దుంభవన్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పశ్యపద్మ, ఈటీ నర్సింహలతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. నరేంద్రమోదీ రామగుండం వచ్చి ఏమి చేస్తారని నారాయణ ప్రశ్నించారు. మోదీ పర్యటనకు నిరసనగా విశాఖపట్నం బంద్‌కు సన్నాహాలు జరుగు తున్నాయని, నిరసనలు, బంద్‌తో మోదీ తెలుగు రాష్ట్రాల్లో అడుగు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. బ్రిటీష్ కాలం నాటి గవర్నర్, రాష్ట్రపతి వ్యవస్థను మొదటి నుంచి తమ పార్టీ వ్యతిరేకిస్తున్నదని స్పష్టంచేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధిలేకుండా ఈ వ్యవస్థను అమలు చేసిందని మండిపడ్డారు. కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వాలను మోదీ సర్కారు ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్ని స్తోందని విమర్శించారు. కరోనా సమయంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన కేరళ ప్రభుత్వానికి భ్రష్టుపట్టిన గవర్నర్ అడ్డుపడతారా అని ప్రశ్నించారు. గవర్నర్ వ్యవస్థ వల్ల ఏడాదికి రూ.60 నుండి రూ.70 కోట్లు వృథా అవుతున్నాయని చెప్పారు. బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలపై సీబీఐ, ఈడీ, గవర్నర్ వ్యవస్థల ద్వారా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.

గవర్నర్‌పై చర్య తీసుకోవాలి

రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని, తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్‌ను వెనక్కి పిలవాలని, రాష్ట్ర ప్రభుత్వంపై ఇష్టానుసారం మాట్లాడుతున్న ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నారాయణ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి, గవర్నర్ వ్యవస్థలు దేశానికి నష్టమని, బ్రిటీష్ కాలం నాటి బానిస వ్యవస్థలకు ఇవి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. తాము అంబేద్కర్ రాజ్యాంగాన్ని చదివితే... గవర్నర్ తమిళి సై ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగం ప్రకారం మాట్లా డుతున్నారన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రకటించిన నాడే ఆమె లక్ష్మణరేఖ దాటుతున్నారని చెప్పా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే ప్రజాదర్బార్‌కు వచ్చిన సమస్యలపై కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు స్పందిస్తుందని ప్రశ్నించారు. తమిళి సై తమిళనాడులో రెండుసార్లు బీజేపీ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారని, రాజకీయ నిరుద్యోగ భృతి కింద ఆమెకు మోదీ ప్రభుత్వం గవర్నర్ పదవి కట్టబెట్టిందని విమర్శిం చారు. స్వయం ప్రతిపత్తి గల విశ్వ విద్యాలయాలకు చాన్సలర్ హోదాలో ఉద్యోగ నియామకాలు ఆపడం ఏమిటని నిలదీశారు. నియామకాలు, ఇతర అంశాలను పూర్తిగా వైస్‌చాన్సలర్ చూసుకుంటారని సూచించారు.

దిల్లీ మద్యం కుంభకోణం కేసులో

శరత్ చంద్రారెడ్డి, వినయ్ బాబు అరెస్టు

ఒకరు అరబిందో డైరెక్టర్ కాగా మరొకరు పెర్నాడ్ రికర్డ్ జనరల్ మేనేజర్

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరబిందో ఫార్మా డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డి, మద్యం కంపెనీ పెర్నాడ్ రికర్డ్ జనరల్ మేనేజర్ వినయ్ బాబును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. రెండు ప్రైవేటు కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లను మనీలాండరింగ్ దర్యాప్తు క్రమంలో ఈడీ బుధవారం అరెస్టు చేసిందని అధికార వర్గాలు గురువారం వెల్లడించాయి. విచారణ సమయంలో వీరిద్దరు సరిగ్గా సమాధానాలు ఇవ్వలేదని అధికారులు తెలిపారు. 'కంపెనీ హోల్‌టైమ్ డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డిని ఈడీ అరెస్టు చేసినట్లు తెలిసింది. అన్ని వివరాలను నిర్ధారించుకున్న తర్వాత స్పందిస్తాం' అని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో అరబిందో ఫార్మా లిమిటెడ్ పేర్కొంది. ఈడీ గురువారం ఇద్దరు ఎగ్జిక్యూటివ్‌లను దిల్లీలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి జ్యుడిషియల్ కస్టడీని కోరింది. దిల్లీ ఎక్సైజ్ విధానం రూపకల్పనలో ప్రభుత్వ అధికారులతో పాటు వీరిద్దరికి ప్రమేయం ఉన్నదని, మొత్తం నెట్వర్క్ 'కార్టలైజేషన్'లో పాత్రధారులని ఆరోపణలు ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఇంతకుముందు నిర్వహించిన తనిఖీల్లో ఒకరి వద్ద దిల్లీ ఎక్సైజ్ విధానం ప్రతి లభించిందని తెలిపాయి. మద్యం విధానాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ రీటైల్ మద్యం వ్యాపారంలో రూ.200 కోట్ల పెట్టుబడులను గుర్తించినట్లు పేర్కొన్నాయి. ఇప్పటివరకు ఈడీ అనేక తనిఖీలు నిర్వహించింది. సెప్టెంబర్‌లో తొలి అరెస్టు జరిగింది. మద్యం కంపెనీ ఇండోస్పిరిట్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ మహంద్రును ఈడీ అదుపులోకి తీసుకుంది. ఈ నెలారంభంలో దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పీఏ ఇంటిని, దిల్లీ కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించింది. ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్, మంత్రి సత్యేంద్ర జైన్‌ను ఈడీ ప్రశ్నించింది. వ్యాపారావేత్త విజయ్‌నాయర్‌ను విచారించిన సీబీఐ... మద్యం వ్యాపారవేత్త అభిషేక్ బోయిన్‌పల్లిని అరెస్టు చేసింది. దిల్లీ మద్యం విధానం అమలులో అక్రమాలు జరిగినట్లు పేర్కొంటూ సీబీఐ విచారణకు దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేయడంతో మద్యం కుంభకోణంపై దర్యాప్తు మొదలైంది. ఇదే క్రమంలో 11మంది ఎక్సైజ్ అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్ తొలగించారు.

పదేళ్లకోకసారి అప్‌డేట్ చేయాల్సిందే

న్యూదిల్లీ: ఆధార్‌కు సంబంధించిన నిబంధనలను కేంద్రప్రభుత్వం సవరించింది. నమోదు చేసుకొని పదేళ్లు పూర్తి అయిన తర్వాత ఆధార్ నంబరు కలిగి ఉన్నవారంతా తమ పేరు, ఫొటో, చిరునామా తదితర వివరాలకు సంబంధించిన పత్రాలను అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేసింది. తద్వారా సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రీపోసిటరీ (సీడీఐఆర్)లో ఆధార్ సంబంధిత సమాచారం కచ్చితంగా ఉండేందుకు వీలు కలుగుతుందని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ గెజిట్ నోటిఫికేషన్ పేర్కొంది. 'ఆధార్ నంబరు ఉన్న ప్రతి ఒక్కరు పదేళ్లకు ఒకసారి ఆధార్‌కు సంబంధించిన అన్ని పత్రాలను గుర్తింపు రుజువు (పీఓఐ), చిరునామా రుజువు (పీఓఏ) ఆధారంగా అప్‌డేట్ చేసుకోవాలి. ఎప్పటికప్పుడు డేటా అప్‌డేట్ చేయడం వల్ల కచ్చితమైన సమాచారం సీఐడీఆర్ ద్వారా అందుబాటులో ఉంటుంది' అని తెలిపింది. ఆధార్ (నమోదు-అప్‌డేట్) నిబంధనలలో ఈ మేరకు మార్పులను ప్రభుత్వం చేసింది. ఆధార్ నంబరు పొంది పదేళ్లకుపైగా అయిన వారంతా తమ గుర్తింపు, చిరునామాకు సంబంధించిన పత్రాలతో వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ గతనెలలో సూచించింది. ఇప్పటివరకు 134కోట్ల ఆధార్ నంబర్లు జారీ కాగా ఆధార్ డేటాను ఎంత మంది అప్‌డేట్ చేయాలన్న దానిపై కచ్చితమైన సమాచారం లేదు. గతేడాది 16 కోట్లకుపైగా వేర్వేరు అప్‌డేట్లు జరిగాయి. కాగా, వెయ్యికిపైగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద లబ్ధి పొందేందుకు ఆధార్ నంబరు తప్పనిసరన్నది తెలిసిందే.

ఉత్తరాఖండ్‌లో రామ్‌దేవ్‌బాబాకు షాక్

ఐదు మందుల ఉత్పత్తి నిలిపివేత

- పతంజలి, దివ్య ఫార్మసీకి ఉత్తరాఖండ్ రెగ్యులేటర్ ఆదేశాలు
- తప్పుదోవ పట్టించే ప్రకటనల సవరణలకు సూచనలు

డెహ్రాడూన్: బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో యోగా గురు బాబా రామ్‌దేవ్‌కు గట్టి షాక్ తగిలింది. ఆయనకు సంబంధించిన పతంజలి కంపెనీకి చెందిన ఐదు మందుల ఉత్పత్తిని నిలిపివేస్తూ ఉత్తరాఖండ్, డెహ్రాడూన్‌లోని ఆయుర్వేద, యునానీ లైసెన్సింగ్ యంత్రాంగం ఆదేశాలను జారీచేసింది. ఈ మేరకు లేఖను ఆ మందులను ఉత్పత్తి చేసే దివ్య ఫార్మసీ, హరిద్వార్‌కు పంపింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలను ఉటంకిస్తూ ఐదు ఔషధాల ఉత్పత్తిని నిలిపివేయాలని, వాటికి సంబంధించి లేబుళ్లను సవరిం చాలని సూచించింది. రక్తపోటు, మధుమేహం, గోయిటర్ (అన్నవాహిక), గ్లాకోమా, అధిక కొలెస్ట్రాల్ చికిత్సకు వినియోగించే మధుగ్రిట్, ఐగ్రిట్, థైరోగ్రిట్, బీపీగ్రిట్, లిపిడోమ్ మందుల ఉత్పత్తి నిలివేతకు ఆదేశాలిచ్చింది.

కేరళకు చెందిన కంటి వైద్య నిపుణుడు కేవీ బాబు జులైలో చేసిన ఫిర్యాదు క్రమంలో లైసెన్సింగ్ యంత్రాంగం స్పందించింది. ఫార్ములేషన్ షీట్లు, లేబుళ్లు సవరించి ఐదు మందులకు మళ్లీ ఆమోదం పొందాలని పతంజలికి స్పష్టం చేసింది. సవరణలను ఆమోదిస్తేనే ఉత్పత్తిని ప్రారంభిం చాలని దివ్య ఫార్మసీకి పంపిన లేఖలో స్పష్టంచేసింది. తప్పుదోవ పట్టించడమే కాకుండా అభ్యంతరకరంగా ఉన్న ప్రకటనలను తొలగించాలని, ఉత్పత్తి లైసెన్స్‌ను ఉపసంహరించు కోవాలని, తదుపరి ఆమోదించిన ప్రకటనలను మాత్రమే ప్రచురించాలని సూచించింది. ఈ అంశంపై వారంలోగా స్పందించాలని ఆదేశించింది. సెప్టెంబర్ ఆరంభంలోనూ ఈ ఐదు ఔషధాల ప్రకటనలను ఉపసంహరించుకోవాలని పతంజలికి లైసెన్సింగ్ యంత్రాంగం సూచించింది. కాగా, పతంజలి దివ్య ఫార్మసీ తరపున డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటన) చట్టం 1954, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్



1940, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్ 1945ని పదేపదే ఉల్లంఘించారని ఫిర్యాదులో బాబు ఆరోపించారు. అక్టోబర్ 11న మరోసారి రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ (ఎస్‌ఎల్‌ఏ)కి ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపారు. ప్రజారోగ్యంపై ఆందోళనతోనే ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ ఐదు మందుల ఉత్పత్తిని నిలిపి వేయాలన్న ఆదేశాలు కాస్త ఉపశమనాన్ని కలిగించాయని, తప్పుడు ప్రకటనలతో మోసపోయి అనేకమంది వీటిని వినియోగించి ఉండవచ్చు అని అల్వార్‌కు చెందిన వైద్యుడు, రాజస్థాన్ క్లినిక్స్ అసోసియేషన్, యునైటెడ్ ప్రైవేట్ హాస్పిటల్స్ కన్వీనర్ రాజ్ శేఖర్ యాదవ్ అన్నారు. ఇదిలావుంటే, తమకు మీడియా ద్వారా సమాచారం తెలిసిందేగానీ ఎలాంటి లేఖ అందలేదని పతంజలి వర్గాలు పేర్కొన్నాయి.

ఉత్సాహంగా భారత్ జోడో

నాందేడ్ పాదయాత్రలో పాల్గొన్న ఎన్‌సీపీ నేతలు

నాందేడ్: భారత్ జోడో యాత్ర మహా రాష్ట్రలో నాల్గోరోజు జోరుగా సాగింది. అన్ని వర్గాల నుంచి అమితా దరణ లభిస్తుండటంతో, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసేందుకు ప్రజలు ఉత్సాహంగా ముందుకు వస్తుండటంతో వారిని అదుపు చేయడానికి భద్రతా సిబ్బం ది చాలా కష్టపడాల్సి వస్తోంది. మార్గం మధ్యలో అనేకసార్లు యాత్రను ఆపి ప్రజలను రాహుల్ పలుకరించారు. అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పిల్లలతో కలిసి ఫొటోలు దిగారు. నాందేడ్‌లో రాహుల్‌తో కలిసి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎన్‌సీపీ నేతలు సుప్రియా సూలే, జయంత్ పాటిల్, జితేంద్ర అవహాద్ పాదయాత్రలో పాల్గొన్నారు. రాహుల్ నాందేడ్ బహిరంగ ర్యాలీలో ప్రసంగించారు. సోమవారం రాత్రి మహారాష్ట్రలోకి ప్రవేశించిన భారత్ జోడో యాత్ర నాందేడ్ నగరం, డెగ్లుర్, అర్థాపూర్ ప్రాంతాల మీదుగా శుక్రవారం హింగోలికి చేరుకుంటుంది. కాగా, మహారాష్ట్రలో 1999 నుంచి 2014 వరకు 15 ఏళ్ల పాటు కాంగ్రెస్-ఎన్సీపీ పరిపాలన సాగింది. మహావికాస్ అగాడీ ప్రభుత్వంలోనూ ఈ రెండు పార్టీలు కూటమిలో భాగంగా ఉన్న విషయం తెలిసిందే.

సురేందర్ రెడ్డి, త్రివిక్రమ్‌లతో బన్నీ సినిమాలు

హైదరాబాద్: అల్లు అర్జున్ 'పుష్ప 2' తర్వాత సురేందర్ రెడ్డి దర్శ కత్వంలో ఓ సినిమా చేయనున్నాడు. ఈ చిత్రం షూటింగ్ 2023 రెండో అర్ధ భాగంలో ప్రారంభం కానుంది. సురేందర్ రెడ్డి సినిమా తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో నాలుగోసారి కలసి పనిచేయనున్నాడు. ఇప్పటికే మాటల మాంత్రికుడు ఆసక్తికం మైన ఐడియాను బన్నీకి వినిపించాడట. ఐకాన్ స్టార్‌కు ఆ ఐడియా ఎంతగానో నచ్చిందని సమాచారం. త్రివిక్రమ్ శ్రీనివాస్ త్వరలోనే పూర్తి స్క్రిప్ట్‌ను బన్నీకి వినిపిస్తాడని సమాచారం. గతంలో అల్లు అర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలసి 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' చిత్రాలు చేశారు. ప్రస్తుతం సినిమా చేస్తే నాలుగోసారి అవుతుంది. 'పుష్ప' తర్వాత అల్లు అర్జున్ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. అందువల్ల 'పుష్ప 2' పై భారీ అంచనాలేర్పడ్డాయి. ఆ అంచనాలను అందుకోవాలని బన్నీ 'పుష్ప 2' పై కొంత కాలంగా పనిచేస్తున్నాడు.

రేపటి నుంచి ఓటీటీలో విశ్వక్‌సేన్ కొత్త సినిమా

హైదరాబాద్: యువ నటుడు విశ్వక్ సేన్ తాజా చిత్రం 'ఓరి దేవుడా'. మిథిలా పాల్కర్, ఆశా భట్ హీరోయిన్లుగా నటించారు. విక్టరీ వెంకటేశ్ అతిథి పాత్రలో నటించాడు. తమిళ చిత్రం 'ఓ మై కడవులే'కి రీమేక్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి మాతృక డైరెక్టర్ అశ్వథ్ మారిముత్తునే దర్శకత్వం వహించాడు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 21న థియేటర్స్‌లో విడుదలైన ఈ చిత్రం అనుకున్నంత విజయవంతం అవలేదు. దీంతో అనుకున్న దాని కంటే ముందే ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనని ఈ సినిమాని కొనుగోలు చేసిన ఆహా వీడియో సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఆహా యాజమాన్యం చేసిన ట్వీట్‌లో.. 'దేవుడా ఓ మంచి దేవుడా తినడానికి పాలకూర పప్పు ఇచ్చావు. ఆలు ఫ్రై ఇచ్చావు. నాలాగే ఈ ప్రపంచంలో ఉన్న వాళ్లందరి కోసం చూడడానికి ఆహాలో "ఓరిదేవుడా" ఇచ్చావు. మా పీడీ మీకు కొంచెం కొత్తగా అనిపించొచ్చు. నవంబర్ 11 రాత్రి 12 గంటలకు ఓరి దేవడా ప్రీమియర్ కాబోతోంది' అని రాసుకొచ్చింది. పీవీపీ సినిమా, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందించారు.

'ది కాశ్మీరీ ఫైల్స్' డైరెక్టర్ కొత్త చిత్రం 'ది వాక్సిన్ వార్'

ముంబై: ఈ ఏడాది బాలీవుడ్‌లో ఎటువంటి అంచనాలు, బలమైన తారాగణం లేకుండా విడుదలై సంచలన విజయం అందుకున్న సినిమా 'ది కాశ్మీరీ ఫైల్స్'. చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం దేశవ్యాప్తంగా సంచలన విజయం సాధించి, దాదాపు రూ.350 కోట్ల వసూళ్లని రాబట్టింది. ఈ సినిమాతో దర్శకుడు వివేక్ అగ్నిహోత్రికి చాలామంచి పేరు వచ్చింది. అంతేకాకుండా ఆయన తదుపరి సినిమా కోసం ఎంతోమంది సినీ ప్రియులు, ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలోనే సోషల్ మీడియా వేదికగా తన తదుపరి సినిమా టైటిల్ పేరు చెప్పమంటూ వివేక్ ఓ పోస్ట్ పెట్టాడు. అందులో.. 'ది.....వార్' అంటూ రాసుకొచ్చాడు. మధ్యలో ఖాళీని పూరించమంటూ పజిల్ వదిలాడు. తాజాగా చేసిన ట్వీట్‌లో వివేక్ ఆ సినిమా పూర్తి టైటిల్ ప్రకటించాడు. ఆయన చేసిన ట్వీట్‌లో.. 'ది వాక్సిన్ వార్' ని తెరకెక్కిస్తున్నాం. భారతదేశం ఓ యుద్ధంలో పోరాడి గెలిచింది. కానీ దాని గురించి మీకు తెలియదు. ఆ అద్భుతమైన నిజమైన కథతో వస్తున్నాం. ఆ యుద్ధంలో సైన్స్, ధైర్యం, గొప్ప భారతీయ విలువలతో గెలిచింది. ఇది 2023 స్వాతంత్ర్య దినోత్సవం రోజున మొత్తం 11 భాషల్లో విడుదల అవుతుంది. మమ్మల్ని ఆశీర్వాదించండి' అని రాసుకొచ్చాడు.

'దార్శనిక' వ్యాపార దిగ్గజం చుక్కపల్లి

మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజాకిరణ్

ఘనంగా పాపులర్ షూ మార్టు 60వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ: దార్శనిక వ్యాపార దిగ్గజం చుక్కపల్లి పిచ్చయ్య అని, ఆయన ఎంతో నిబద్ధతలో వ్యాపారం చేశారని వక్తలు కొనియాడారు. పాపులర్ షూ మార్టు 60వ వార్షికోత్సవం ఎస్ఎస్ కన్వెషన్‌లో గురువారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజాకిరణ్ మాట్లాడుతూ , భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు అయిన సందర్భంలో 60 ఏళ్ల వ్యాపార ప్రస్థానాన్ని కొనసాగించిన పాపులర్ షూ మార్టు సంస్థ పిచ్చయ్య దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వాణిజ్యం భారత వ్యాపారానికి వెన్నెముక లాంటిదన్నారు. బ్రిటీష్ వారు మన దేశాన్ని పరిపాలించక ముందే భారత్ 24 శాతం స్థూలజాతీయోత్పత్తిని కలిగి చైనా కంటే ముందు ఉందన్నారు. స్వాతంత్ర్య అనంతరం పరిశ్రమలు ఏర్పాటు చేసిన తరువాత ఆదాయం వృద్ధి చెందిందన్నారు. మిశ్రమ వాణిజ్య విధానం, 2010లో ఇంటర్నెట్ ఆధారిత వాణిజ్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. 2014లో మేకిన్ ఇండియాతో వాణిజ్యంలో మార్పు సంభవించిందన్నారు. 2015లో డిజిటల్ ఇండియా వచ్చిన తరువాత చెల్లింపుల విప్లవానికి నాంది పలికిందన్నారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కే.ఎల్.వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, చుక్కపల్లి పిచ్చయ్య కమ్యూనిస్టు భావాలతో పని చేసే వారని తెలిపారు. 'నీ శ్రమను నువ్వు నమ్ముకో' అనే పద్ధతిని వ్యాపారంలో పాటించారని చెప్పారు. కమ్యూనిజంలోనే మానవత్వం ఉందని నమ్మేవారని తెలిపారు. సంపదను పెంచటం, పంచటం చేశారని కొనియాడారు. యువత ఐటీ భ్రమల్లో జీవిస్తుంటడం మంచిది కాదన్నారు. అమెరికా మార్కెటింగ్ దేశంగా మారిందన్నారు. వస్తుత్పత్తి లేకపోతే దేశ ప్రగతి లేదన్నారు. మనకు కావాల్సింది 'మేక్ ఇన్ ఇండియా' కాదని 'మేడ్ ఇన్ ఇండియా' కావాలని అన్నారు. చుక్కపల్లి సూక్తులు ముద్రించిన పుస్తకాలను పంపిణీ చేసే వారని గుర్తు చేశారు. పైగా వాటిని ఆచరించే వారని చెప్పారు. తొలుత పాపులర్ షూ మార్టు ప్రస్థానాన్ని, చుక్కపల్లి సేవా ట్రస్ట్ అందిస్తున్న సేవా కార్యక్రమాలను సంస్థ మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ వివరించారు. పాదరక్షల రంగంలో తమతో భాగస్వామిగా ఉన్న సంస్థల ప్రతినిధులకు, పాపులర్ షూ మార్టు సంస్థలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న వారికి జ్ఞాపికలు అందజేశారు. పాపులర్ షూ మార్టు మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయ్‌కుమార్, డైరెక్టర్ సాత్విక్, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, పారిశ్రామిక వేత్తలు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ను ముగించిన ఓపెనర్లు

బౌలింగ్, ఫీల్డింగ్‌లో టీమిండియా చెత్త ప్రదర్శన

అడిలైడ్: టీ20 ప్రపంచకప్ 2022లో టీమిండియా పోరాటం ముగిసింది. గురువారం జరిగిన సెమీఫైనల్-2లో సమష్టిగా విఫల మైన రోహిత్ సేన.. 10 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ చేతిలో చిత్తయ్యింది. ఇంగ్లండ్ ఓపెనర్లు జోస్ బట్లర్(49 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సలతో 80 నాటౌట్), అలెక్స్ హేల్స్(47 బంతుల్లో4 ఫోర్లు, 7 సిక్సలతో 86 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్‌కు కనీస పోరాటం కూడా చేయకుండా భారత ఆటగాళ్లు చేతులెత్తేశారు. ముఖ్యంగా పేలవ బౌలింగ్‌తో కనీసం ఒక్క వికెట్ తీయలేకపోయారు. ఈ మెగా టోర్నీలోనే టీమిండియాకు ఇది అత్యంత ఘోర పరాజయం. జోస్ బట్లర్, హేల్స్ ధాటికి భారత బౌలర్లు పోటీపడీ పరుగులిచ్చుకున్నారు. మైదానంలో రోహిత్ ఎన్ని వ్యూహాలు పన్నినా ఈ జోడీని విడదీయ లేకపోయాడు. దాంతో మరోసారి టీమిండియా టైటిల్ లేకుండానే ఇంటిదారిపట్టింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా(33 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సలతో 63), విరాట్ కోహ్లి(40 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ జోర్డాన్ మూడు వికెట్లు తీయగా.. ఆదిల్ రషీద్, క్రిస్ వోక్స్ తలో వికెట్ తీశారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన ఇంగ్లండ్ 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 170 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. జోస్ బట్లర్, అలెక్స్ హేల్స్ హాఫ్ సెంచరీలతో 170 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని ఇచ్చి, చిరస్మరణీయ విజయాన్నం దించారు. భారత బౌలర్లలో భువీ రెండు ఓవర్లలో 25 పరుగులివ్వగా.. అర్షదీప్ 2 ఓవర్లలో 15, అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 30, మహమ్మద్ షమీ 3 ఓవర్లలో 39, రవిచంద్రన్ అశ్విన్ 2 ఓవర్లలో 27, హార్దిక్ పాండ్యా 3 ఓవర్లలో 34 పరుగులు సమర్పించుకున్నారు.

కోహ్లి కొత్త రికార్డ్

టీ20ల్లో 4వేల పరుగులు చేసిన తొలి ఆటగాడిగా గుర్తింపు

అడిలైడ్: టీ20 ప్రపంచకప్ టోర్నీలో సూపర్ ఫామ్‌తో చెలరేగి ఆడుతున్న పరుగుల వీరుడు విరాట్ కోహ్లి పొట్టి ఫార్మాట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో నాలుగు వేల పరుగులు సాధించిన తొలి ఆటగాడిగా అరుదైన ఘనత సాధించాడు. అడిలైడ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో విరాట్ ఈ రికార్డును అందుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటికే అత్యధిక పరుగుల వీరుడిగా ఉన్న కోహ్లి.. గురువారం జరిగిన మ్యాచ్‌లో 4వేల మైలురాయిని దాటాడు. మొత్తంగా 115 మ్యాచ్‌ల్లో 4008 పరుగులతో ఈ ఫార్మాట్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇందులో ఒక సెంచరీ, 36 అర్ధశతకాలు ఉన్నాయి. కోహ్లి తర్వాత 3,853 పరుగులతో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ ఆటగాడు గప్తిల్(3497), పాక్ కెప్టెన్ బాబర్ అజామ్(3323), ఐర్లాండ్ ఆటగాడు స్టిర్లింగ్ (3181) ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇక, ఇప్పటికే టీ20 ప్రపంచకప్ పోటీల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ అవతరించిన విషయం తెలిసిందే. శ్రీలంక మాజీ కెప్టెన్ జయవర్ధనే(1,016)ను వెనక్కి నెట్టి 1,141 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుత టోర్నీలోనూ అత్యధిక పరుగుల రికార్డు విరాట్‌దే. 6 మ్యాచ్‌ల్లో 296 పరుగులు సాధించాడు. ఇక టీ20 ప్రపంచకప్ పోటీల్లో 100 బౌండరీలు కొట్టిన ఆటగాడు కూడా కోహ్లినే కావడం విశేషం. 2014, 2016 టీ20 ప్రపంచకప్ పోటీల్లో కోహ్లి అత్యుత్తమ ప్రదర్శన చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.